RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 293 మేడ్చల్ మల్కాజ్‌గిరి 14 నవంబర్ 2024 గురువారం పేజీలు : 4

## పశ్చిమాసియా ఉద్రిక్తతలు.. భారత్‌పై తీవ్ర ప్రభావం!

న్యూఢిల్లీ : ఇరాన్ నుంచి క్షిపణులు ఇజ్రాయెల్‌పైకి దూసుకెళ్తున్నాయి.. ఇజ్రాయెల్ దళాలు లెబనాన్‌లో దాడులు జరుపుతున్నాయి.. మనకు కొన్ని వేల కి.మీ.ల దూరంలో ఈ పరిణామాలు జరుగుతున్నా.. మన మీద ఇవి తీవ్ర ప్రభావం చూపే అవకాశాలున్నాయి.

పశ్చిమాసియాతో భారత్‌కు సన్నిహిత సంబంధాలు ఉండటమే దీనికి కారణం. చమురు దిగుమతులు, పలు రకాల ఉత్పత్తుల ఎగుమతులు, గల్ఫ్ దేశాల్లో కొన్ని లక్షల మంది భారతీయులు పని చేస్తుండటం.. వీటన్నింటిపైనా ప్రభావం కనిపించే అవకాశం ఉంది.



# రైతులకు శుభవార్త!

## ఎకరానికి రూ.15 వేలు.. మంత్రి తుమ్మల కీలక అప్డేట్!!

హైదరాబాద్ : తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అనేక రైతు సంక్షేమ పథకాలు అమలు చేస్తోంది. ఇప్పటికే రూ. 2 లక్షల రైతు రుణమాఫీని అమలు చేసింది. మూడు విడతల్లో దాదాపు రూ.18 వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేసారు. ఇక ప్రస్తుతం ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించగా.. సన్న వడ్లకు క్వింటాకు రూ. 500 బోనస్ ఇచ్చేందుకు సిద్ధమైంది. తాజాగా.. రైతులు ఎప్పట్నుంచో ఎదురు చూస్తున్న రైతు భరోసా పంట పెట్టుబడి సాయంపైనా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కీలక అప్డేట్ ఇచ్చారు. తమ ప్రభుత్వం రైతు భరోసా పథకాన్ని ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందని మంత్రి తుమ్మల అన్నారు. ఎటువంటి అవకతవకలకు తావు లేకుండా పక్కాగా రైతుల ఖాతాల్లో పంట పెట్టుబడి సాయం అందిస్తామని చెప్పారు. ఇప్పటికే ఈ పథకం అమల కోసం మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఉపసంఘం నివేదిక రాగానే.. వీలైనంత త్వరలో రైతుల ఖాతాల్లో పెట్టుబడి సాయం డబ్బులు జమ చేస్తామన్నారు. తాము అధికారంలోకి వచ్చిన 11 నెలల కాలంలోనే ఎన్నికల హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని చెప్పారు. పంట పెట్టుబడి సాయం కింద ఎకరానికి రూ.15 వేల నగదును త్వరలోనే వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామన్నారు. నవంబర్ 14 నుంచి డిసెంబర్ 9 వరకు తెలంగాణలో ప్రజా విజయోత్సవ కార్యక్రమాలు చేపడుతున్నట్లు మంత్రి తుమ్మల వెల్లడించారు. తమ పాలనకు ఏడాది పూర్తి అవుతున్న సందర్భంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలోనే రైతులకు రైతు భరోసా పంట పెట్టుబడి సాయం అందించనున్నట్లు చెప్పారు. మంత్రి ప్రకటనతో అన్నదాతల్లో ఆనందం వెల్లువిరుస్తోంది. కాగా, గత ప్రభుత్వం రైతు బంధు పేరుతో పంట పెట్టుబడి సాయం అందించింది. ఎకరాకు రూ. 10 వేల చొప్పున రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేశారు. ఖరీఫ్, రబీ సీజన్ల వారీగా రెండు విడతల్లో రూ.5 వేల చొప్పున మొత్తం ఎకరాకు రూ.10 వేలు రైతుల ఖాతాల్లో జమ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇదే పథకాన్ని రైతు భరోసా పేరుతో తీసుకొచ్చింది. ఎకరానికి రూ. 15 వేలు రెండు విడతల్లో జమ చేయనున్నారు. గతంలో ఈ పథకం అమలులో అక్రమాలు జరిగాయని... ఈసారి అలా జరగకుండా పక్కాగా పంట పెట్టుబడి సాయం అందిస్తామని మంత్రి తుమ్మల ఇది వరకే ప్రకటించారు. విధివిధానాల కోసం మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేశామని నివేదిక రాగానే పెట్టుబడి సాయం అందిస్తామన్నారు. మొదట ఒక ఎకరం నుంచి మొదలుపెట్టి డిసెంబర్ చివరి నాటికి అందరికి రైతు భరోసా ఇవ్వాలని సర్కారు యోచిస్తున్నట్లు తెలుస్తోంది.

## బతుకమ్మ కుంటలో కూల్చివేతలు ఉండవు: హైడ్రా కమిషనర్ రంగనాథ్

హైదరాబాద్: అంబర్‌పేటలోని బతుకమ్మ కుంటను హైడ్రా కమిషనర్ రంగనాథ్ పరిశీలించారు. దాని పునరుద్ధరణపై స్థానికులతో మాట్లాడారు. నిర్మాణ వ్యర్థాలు పోసి ఆక్రమించడంతో 16 ఎకరాలు ఉన్న బతుకమ్మ కుంట 5.15 ఎకరాలకు కుచించుకుపోయిందని, స్థానికుల విజ్ఞప్తితో చెరువు పునరుద్ధరణ పనులు చేపడతామని ఆయన హామీ ఇచ్చారు. నివాసాలు, నిర్మాణాల జోలికి హైడ్రా వెళ్లదంటూ స్థానికులకు రంగనాథ్ భరోసానిచ్చారు. హైడ్రా కమిషనర్ రాకతో



బతుకమ్మ కుంట పరిసరాల్లో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలీసు భద్రత మధ్య రంగనాథ్ బతుకమ్మ కుంటను పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.

"బతుకమ్మ కుంటలో కూల్చివేతలు ఉండవు. కుంటను పునరుద్ధరిస్తాం. కూల్చివేతల చేపడతామనే అపోహ స్థానికుల్లో ఉంది. దాన్ని తొలగించేందుకే బతుకమ్మకుంటకు వచ్చాను. ప్రస్తుతమున్న ఐదు ఎకరాల విస్తీర్ణంలోనే పునరుద్ధరణ చేస్తాం. చెరువులోకి వరద నీరు వచ్చే మార్గాలపై అధికారులతో చర్చిస్తాం.

హైడ్రాకు నోటీసులు ఇచ్చే అధికారం ఉంది. ఆక్రమణదారులకు హైడ్రా నోటీసులు వెళ్తూనే ఉంటాయి"అని రంగనాథ్ తెలిపారు.




హైదరాబాద్ : ఏపీ సీఎం, టీడీపీ చీఫ్ చంద్రబాబు నాయుడు సహకరిస్తే ఏడాదిలోనే కాంగ్రెస్ నుంచి ప్రధానమంత్రి వస్తారని సీఎం రేవంత్ రెడ్డి కామెంట్ చేశారు. హిందూయిజం అంటే ఇతర మతాలను వ్యతిరేకించడం కాదని.. అందరినీ కలుపుకొనిపోవడమని అన్నారు. 'మోదీ కేబినెట్‌లో ఒక్క ముస్లిం అయినా ఉన్నారా? 15 శాతం జనాభా ఉంటే ఒక్క పదవి కూడా ఇవ్వరా? మేం ఒకటో రెండో పదవులు ఇస్తే వ్యతిరేక ప్రచారం చేస్తున్నారు. ముస్లింలు, క్రిస్టియన్లు ఈ దేశ ప్రజలు కాదా? స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొనలేదా? ఇప్పుడు నేను ఇలా మాట్లాడినందుకు హిందువులకు వ్యతిరేకి అని ప్రచారం చేస్తారు. కానీ అది ఎక్కువ రోజులు నడవదు' అని చెప్పారు. "మోదీ ఐస్, నైస్ ఫార్ములాతో ముందుకెళ్తున్నారు. ఐస్ అంటే ఇన్‌కంట్యాక్స్, సీబీఐ, ఈడీ. నైస్ అంటే నార్కోటిక్స్' అని పేర్కొన్నారు. "భద్రాచలంలో పెద్ద రామమందిరం ఉంది. అది మాకు గర్వకారణం. మోదీ, అమిత్ షా భద్రాచలానికి వస్తే.. నేను అయోధ్యకు వెళ్తాను' అని చెప్పారు. "ఏపీ, తెలంగాణ మధ్య సాగునీళ్లు, ఇతర విభజన సమస్యలు ఉన్నాయి. మేం వాటిని పరిష్కరించుకోవాలని అనుకుంటున్నాం. పంచాది పెట్టుకోవాలనుకోవడం లేదు' అని తెలిపారు.

## ప్రజల తిరుగుబాటును భారాసకు ఆపాదించే కుట్ర

హైదరాబాద్: కొడంగల్ మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి అరెస్టును భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఖండించారు. ఈమేరకు 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. ప్రజలు చేసిన తిరుగుబాటును భారాసకు ఆపాదించే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో కార్యకర్తలతో మాట్లాడినా నేతలను అదుపులోకి తీసుకుంటున్నారన్నారు. ప్రజా తిరుగుబాటు అణచివేతకు



అప్రజాస్వామిక చర్యలకు దిగారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే అక్రమ అరెస్టులు తప్పవని బెదిరిస్తున్నారని దుయ్యబట్టారు. తమను భయపెట్టాలని చూస్తే అది మూర?పు చర్యే అవుతుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అప్రజాస్వామిక చర్యలపై పోరాటం కొనసాగుతుందని తెలిపారు. ఎంత అణచివేసే ప్రయత్నం చేస్తే అంతగా పోరాటం చేస్తామన్నారు. లగచర్లలో అరెస్టు చేసిన రైతులను విడుదల చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

**పచ్చని పొలాల్లో చిచ్చు పెట్టడమే ప్రజాపాలనా?: హరీశ్‌రావు**

కొడంగల్ మాజీ ఎమ్మెల్యే నరేందర్ రెడ్డిని అదుపులోకి తీసుకోవడాన్ని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు (%ఝుతీఅంష్ట్ర ఞశీ%) ఖండించారు. ఈమేరకు ఆయన 'ఎక్స్' వేదికగా పోస్టు చేశారు. పాలన గాలికి వదిలి అక్రమ కేసులతో రాజకీయ కక్ష తీర్చుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. పచ్చని పొలాల్లో ఫార్మాసిటీ పేరిట చిచ్చు పెట్టడమేనా ప్రజాపాలన అని ప్రశ్నించారు. ప్రశ్నించే గొంతులను అక్రమ అరెస్టులు, కేసులతో అణచివేయలేరన్నారు. ప్రజల తరఫున ప్రభుత్వాన్ని నిలదీస్తూనే ఉంటామని హరీశ్‌రావు పేర్కొన్నారు.

# హైడ్రాకు షాక్..

## కూల్చివేతలపై సుప్రీం కోర్టు సంచలన వ్యాఖ్యలు!



హైదరాబాద్ : ప్రభుత్వాలకు అత్యున్నత ధర్మాసనం వార్నింగ్ ఇచ్చింది. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై బుల్డోజర్లను ప్రయోగించడాన్ని సుప్రీం కోర్టు తప్పుపట్టింది. న్యాయబద్ధమైన నోటీసులు ఇవ్వకుండా కూల్చివేతలు చేపట్టొద్దని స్పష్టం చేసింది. దేశంలోని అన్ని రాష్ట్రాలు తీర్పును పాలించాల్సిందే అని తేల్చి చెప్పింది. నిందితులను దోషులు నిర్ధారించొద్దని పేర్కొంది. విచారణ పూర్తికాకుం డానే నిందితులను దోషిగా పరిగణించలేం అని అభిప్రాయపడింది. దోషిగా నిర్ధారించిన చట్ట ప్రకారమే శిక్ష ఉండాలని తెలిపింది. నిందితుల ఇళ్లను బుల్డోజర్తో కూల్చడం చట్ట విరుద్ధం అని చెప్పింది. ఇళ్లను కూల్చడం అంటే నివసించే హక్కును కాలరాయడమే అని స్పష్టం చేసింది. అయితే తెలంగాణలో ఇటీవల హైడ్రా సంచలనం సృష్టించిన సంగతి తెలిసిందే. చెరువులు, నాలాలు ఆక్రమించి నిర్మించిన నిర్మాణాలపై హైడ్రా ఉక్కుపాదం మోపుతున్న సంగతి తెలిసిందే. హైడ్రా కార్యాచరణ అనేక విమర్శలకు దారి తీసింది. తమకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా ఇళ్లను కూల్చివేశారని బాధితులు నుంచి ఆరోపణలు వచ్చాయి. అయితే తాజాగా సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుతో కట్టడాలను కూల్చాలని అనుకుంటే నోటీసులు ఇవ్వడం తప్పనిసరి అయింది.

**రంగనాథ్ కీలక వ్యాఖ్యలు...** హైడ్రా కమిషనర్ రంగనాథ్ బెంగళూరు పర్యటన ముగించుకొని హైదరాబాద్ కు తిరిగి వచ్చారు. కాగా ఈరోజు బతుకమ్మ కుంట ప్రాంతంలో పరిశీలనకు వచ్చారు.

అనంతరం కీలక వ్యాఖ్యలు చేశారు రంగనాథ్. బతుకమ్మ కుంట చెరువుకు పూర్వ వైభవం తీసుకొస్తాం అని అన్నారు. బతుకమ్మ కుంట ప్రాంతంలో ఎలాంటి ఇళ్ల కూల్చివేతలు ఉండవని స్పష్టం చేశారు. ప్రజలు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. అన్ని శాఖల అధికారులతో ఇప్పటికే చర్చించామని చెప్పారు. అన్ని పార్టీల నేతలు కూడా బతుకమ్మ కుంట పునరుద్ధరణ కోసం తనను కలిసినట్లు చెప్పారు. త్వరలోనే హైడ్రా ఆధ్వర్యంలో పునరుద్ధరణ చర్యలు ప్రారంభమవుతాయని అన్నారు .

# సంపాదకీయం

## న'బూతో' నభవిష్యత్తు...అంతేనా ?

కాదేదీ బూతులకు అనర్హం అన్నట్లుగా సమాజం తయారవుతోంది. మామూలుగా మాట్లడితే అసలు కుదిరి చావడం లేదు. ఎందుకంటే మెదళ్ళు అన్నీ మొద్దు బారిపోయి ఉన్నాయని భావన. అందుకే చెవుల్లోనే కాదు మనసుల్లోనూ కలకాలం నిలవాలంటే వేరే భాష వాడాల్సిందేనా. ఇదే ఇపుడు చర్చగా ఉంది. ఒకపుడు రాజకీయాలు ఇపుడు రాజకీయాలు అని ఒక పెద్ద విభజన గీత గీసి మాట్లాడుకోవాల్సి వస్తోంది. ఎందుకంటే ఒకనాడు హుందాకే కేరాఫ్ గా పొలిటీషియన్లు ఉండేవారు. అధికార పక్షం విపక్షాల మధ్య ఆవేశ కావేశాలు నాడూ ఉండేవి. కానీ హద్దులు అయితే దాటిపోలేదు. ఒక ఉన్నత ప్రమాణాలను అంతా పాటిస్తూ వెళ్ళేవారు. ఇపుడు అలా లేదు పరిస్థితి అని అంతా పెదవి విరుస్తున్నారు. ఏపీలో అయిదేళ్ల పాటు అధికారం చలాయించిన వైసీపీలో కొందరు మంత్రులు తీరు వివాదాస్పదం అయింది అంటే వారు వాడే భాషను బట్టే అని అనేవారు. బూతుల నేతలు పోలింగ్ బూతులతోనే బుద్ధి చెప్పాలని కూడా రాజకీయం ఆసాంతం చూసిన పెద్దలు కూడా హితవు చెబుతూ వచ్చారు ఇక ఏపీలో టీడీపీ నేతలు కొందరు కూడా అదే తీరులో గతంలో ఉండేవారు. వారిని మించి ఒవర్ డోస్ వైసీపీ చేయడం దాని ఫలితాలు చూడడంతో ఇపుడు రెండు వైపుల నుంచి ప్రస్తుతానికి కొంత కంట్రోల్ ఉన్నట్లుగా ఉంది. అయితే తెలంగాణాలో మాత్రం అలా లేదు. ఏపీని మించి అన్నట్లుగా సాగుతోంది. ఆఖరుకు రాజకీయాలతో సంబంధం లేని వారిని కూడా తెచ్చి విమర్శలు చేస్తున్నారు. అత్యంత జుగుప్సాకరంగా ఈ విమర్శలు ఉంటున్నాయి. కాంగ్రెస్ మహిళా మంత్రి కొండా సురేఖ కేటీఆర్ ని టార్గెట్ చేస్తూ మధ్యలో సినీ తారలను తెచ్చి చేసిన కామెంట్స్ ని చూస్తే ఇదేమి రాజకీయం అనుకుంటున్నారు. కేటీఆర్ ప్రత్యర్థి పార్టీకి చెందిన వారు. ఆయన్ని విమర్శించాలి అంటే ఇంతకు మించినది లేదా అన్న మాటలు కూడా వినిపిస్తున్నాయి. అయితే అదే సమయంలో మహిళా మంత్రి సురేఖను ట్రోల్స్ చేస్తున్న వారి విషయంలోనూ ఆలోచించాల్సిందే. ఆమెను ఎందుకు అలా చేస్తారు అని కూడా అంతా గట్టిగా వాదించాల్సిందే. దెబ్బకు దెబ్బ అన్నట్లుగా బూతుకు బూతుతోనే బదులు అన్నట్లుగా పరిస్థితి మారితే చేసేవారు ఎవరూ లేరు. పాతాళానికి దారులు వెతకకుండానే జారుడు బల్లలు అలా చూపిస్తూ ఉంటాయి. ఆఖరుకు ఎక్కడికి పోతున్నారో కూడా తెలియనంత లోతుల్లో పడిపోతారు. ఏది ఏమైనా సమాజంలో మార్పులు వచ్చాయి. ఒకనాడులా ఏ రంగమూ లేదు. అయితే దేనికైనా ఒక చెలియలికట్ట ఉంటుంది. ఎంతలా మారింది అనుకున్నా ఎంతో కొంత హద్దు ఉండాలి. పరదాలు ఉండాలి. పరాచికాలు అయినా సరదాలు అయినా కూడా అవి వెగటుగా జుగుప్సగా మారనంతవరకే అంతా ఆస్వాదిసారు. ఒక్కసారి అవి కట్టు తప్పితే గుట్టు విప్పితే ఇక వేటికీ విలువ లేకుండా పోతుంది. అలా చేసుకోవాలో ఎలా మెలగాలో ఎవరికి వారే నిర్ణయించుకోవాలి. ఎందుకంటే ఇక్కడ చెప్పేది ఎవరూ కాదు, వినేందుకు ఎవరూ సిద్ధంగా లేరు కాబట్టే ఇదంతా.

## మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కుటుంబ సర్వే, ధాన్యం సేకరణ అంశాలపై మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ తో కలిసి, కలెక్టరేట్ కార్యాలయంలో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించిన ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రత్యేక అధికారి దేవరాజన్ ...





జిల్లా బ్యూరో మేడ్చల్ మల్కాజ్గిరి (గరుడ వార్త) :సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో సర్వేకు వచ్చే సమయాన్ని ముందుగానే కుటుంబాలకు తెలిపి, అవసరమైన డాక్యుమెంట్లను అందుబాటులో ఉంచుకునే విధంగా చర్యలు తీసుకోవాలని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రత్యేక అధికారి దివ్య దేవరాజన్ మేడ్చేల్ మల్కాజిగిరి జిల్లా సర్వే నోడల్ అధికారులకు సూచించారు. బుధవారం మేడ్చేల్ కలెక్టరేట్ జిల్లా విసి హాల్ లో కుటుంబ సర్వే, ధాన్య సేకరణ అంశాల పై మేడ్చేల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతం తో కలిసి ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ప్రత్యేక అధికారి హెూదాలో దివ్యా దేవరాజన్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి మాట్లాడుతూ సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో అందుబాటులో లేని కుటుంబ సభ్యులకు ముందుగానే సర్వే సమయాన్ని, అవసరమైన డాక్యుమెంట్లను అందుబాటులో పెట్టు కునేలా ఎన్యుమరేటర్ల ద్వారా ఇంటింటికి తెలిపేందుకు చర్యలు తీసుకోవాలని సర్వే నోడల్ అధికారులకు సూచించారు. ఎన్యుమరేటర్లు డాక్యుమెంట్లు చూసి తప్పులు జరుగకుండా ప్రొఫార్మాలను పూరించాలని, ఏదైన సందేహం ఉంటే సూపర్ వైజర్, నోడల్ అధికారి దృష్టికి తీసుకురావలని సూచించారు. ఒక ప్రణాళిక ప్రకారం షెడ్యూల్ చేసుకొని సర్వే నిర్వహించాలన్నారు. ఈ జిల్లాలో వలసదారులు ఎక్కువగా ఉన్నందున వారు స్వచ్ఛందంగా కోరిన చోట నమోదు చేయించాలన్నారు. ఎన్యుమరేటర్లు కుటుంబ సభ్యులతో సౌమ్యంగా మాట్లాడి సమాధానలు తెలుసుకుంటూ, ప్రత్యేక్షంగా పరిశీలించిన అంశాలను ప్రొఫార్మాలో కొంత వరకు పూరించాలని అన్నారు. సర్వే నిర్వహణలో కలిగే సమస్యలను నోడల్ అధికారులు చొరవ తీసుకొని పరిష్కరించాలన్నారు. అంతకు ముందు జిల్లా నోడల్ అధికారులతో తమ పరిధిలో క్షేత్రస్థాయిలో జరుగుతున్న సర్వే వివరాలను అడిగి తెలుసుకున్నారు. సర్వేలో ఎదురయ్యే ఇబ్బందులను, సమస్యలను నోడల్ అధికారులతో అడగి తెలుసుకున్నారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే సమగ్ర సమాచారాన్ని ప్రత్యేక అధికారి దివ్య దేవరాజన్ కు మేడ్చేల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతం సవివరంగా వివరించారు. జిల్లాలో గ్రూప్ -3 పరీక్షలు ఉన్నందున, సర్వే పూర్తి కావడానికి ఇంకా కొంత సమయం అవసరమవుతుందని కలెక్టరు తెలిపారు. ఈ సమవేశంలో జిల్లా అదనపు కలెక్టరు విజయేందర్ రెడ్డి, ఆర్డిఓలు సైదులు, శ్యాం ప్రకాష్, డిఆర్డిఓ సాంబశివరావు, జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి వినోద్ కుమార్, జిల్లా సంక్షేమ శాఖధికారి స్వర్ణలత, జిల్లా వ్యవసాయ శాఖాధికారి చంద్రకళ, జిల్లా పౌర సరఫరా డిఎం సుగుణబాయి, జిల్లాయువజన అధికారి గోపాల్ రావు, జిల్లా మత్స్య శాఖ అధికారి, జిల్లా పరిశ్రమలశాఖాధికారి ప్రశాంత్, ఎస్సీ కార్పొరేషన్ అధికారి బాబు మోసిస్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. అనంతరం కలెక్టరేట్ లోని ఇందిరామహిళా శక్తి క్యాంటీన్ ను పరిశీలించి, పదార్థాలను రుచి చూసారు.

## తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడిగా యాదగిరి నియామకం



శామీర్ పేట, (గరుడ వార్త) : ఉద్యమకారుల సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతానని నూతనంగా అధ్యక్షుడిగా నియమితులైన రుద్రబోయిన యాదగిరి అన్నారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మండల అధ్యక్షుడిగా రుద్రబోయిన యాదగిరి నియమితులయ్యారు. శామీర్ పేట మండలం తుర్కపల్లి గ్రామానికి చెందిన రుద్రబోయిన యాదగిరి ముదిరాజ్ ను నియమిస్తు రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్ ఉత్తర్వులు జారీ చేశాడు. మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు జిట్టా శ్రీనివాస్ రెడ్డి చేతులమీదుగా బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన రుద్రబోయిన యాదగిరి ముదిరాజ్ మాట్లాడుతూ తన పై ఎంతో నమ్మకం, విశ్వాసం తో శామీర్ పేట మండల తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నూతన అధ్యక్షునిగా నియమించినందుకు రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు జిట్ట శ్రీనివాస్ రెడ్డి లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. తాను బాధ్యతగా ఉద్యమకారుల సంక్షేమమే లక్ష్యంగా, నిరంతరం ఉద్యమకారుల గొంతుకగా పనిచేసా నని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటులో ఉద్యమకారుల పాత్ర ఎంతో కీలకమైంది అన్నారు. అన్యాయానికి గురయిన తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి వారికి ప్రభుత్వం నుంచి పోరాడి సమూచిత న్యాయం చేసేందుకై తాను శాయశక్తుల కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమకారులు అనంతలక్ష్మీ. పరుశరాం, బండకింది ప్రసాద్, మందస్వామి, తదితరులు పాల్గొన్నారు.

## అంచనాలకు మించి చెల్లింపులు!

సిరిసిల్ల : జిల్లాలోని మధ్యమానేరు, కాళేశ్వరం 9వ ప్యాకేజీ నిర్మాణాల్లో అంచనాలకు మించి చెల్లింపులు చేయడంపై విజిలెన్స్ విచారణ ముమ్మరం చేసింది. దీనికి అప్పటి గుత్తేదారు సంస్థలకు బిల్లుల చెల్లింపుల్లో ఇంజినీర్లు సహకరించారని వచ్చిన ఫిర్యాదుల మేరకు గత నెల 21న కరీంనగర్‌లోని ఈఎన్‌సీ కార్యాలయం నుంచి రెండు ప్రాజెక్టులకు సంబంధించిన అన్ని దస్త్రాలను స్వాధీనం చేసుకున్నారు. నిర్మాణాలు ప్రారంభమైనప్పటి నుంచి పూర్తయ్యే వరకు ఎక్కడెక్కడ అంచనాలు పెంచారు, వాటి వెనక కారణాలు, ప్రభుత్వ అనుమతులు, గుత్తేదారు సంస్థలకు చెల్లింపులు, ఇంజినీర్ల ప్రమేయం ఇలా అన్ని కోణాల్లో పరిశీలిస్తున్నారు.

కాళేశ్వరం 9వ ప్యాకేజీలో సొరంగం, సర్జ్‌పూల్, మల్కపేట రిజర్వాయరు ప్రధానం. 2015లో కాళేశ్వరం ప్రాజెక్టుల రీడిజైన్‌లో గత ప్రభుత్వం దీని సామర్థ్యం పెంచి నిర్మాణ వ్యయాన్ని రూ.911 కోట్లుగా నిర్ణయించింది. మధ్యమానేరు వెనక జలాలు నుంచి మల్కపేట జలాశయానికి 12 కిలోమీటర్ల సొరంగం తవ్వకాల్లో తీవ్ర జాప్యం జరిగింది. 2018లో పనుల్లో వేగం పెంచేందుకు సిరిసిల్ల శివారులోని చంద్రపేట వద్ద సొరంగానికి అదనపు అడిట్‌ను ఏర్పాటు చేశారు. దీనికోసం భూసేకరణ, అడిట్ నిర్మాణానికి కలిపి రూ.6 కోట్లు అదనపు వ్యయం చేశారు.

సొరంగం నుంచి మల్కపేట జలాశయంలోకి నీటిని తరలించేందుకు ఉపరితల పంపుహౌస్ నిర్మాణం చేపట్టారు. దీన్ని పరిశీలించిన అప్పటి ఇంజినీరింగ్ ఉన్నతాధికారులు ఉపరితలంలో కాకుండా సొరంగంలోనే ఉండాలని సూచించడంతో తవ్వుతున్న పంపుహౌస్‌ను మధ్యలో వదిలేసి సొరంగంలో మరొకటి తవ్వారు. దీనికి రూ.22 కోట్ల మేర అదనపు ఖర్చు చేశారు.

2021, 2022లో కురిసిన భారీ వర్షాలకు సొరంగం పూర్తిగా మునిగిపోయింది. అప్పటికీ భూగర్భంలోనే కంట్రోల్ గది నిర్మాణం జరుగుతోంది. భవిష్యత్తులో వరదలొస్తే కంట్రోల్ గది మునిగి అందులోని ఎలక్ట్రికల్ ప్యానల్స్, కంప్యూటర్ వ్యవస్థకు తీవ్ర నష్టం జరుగుతుంది. దీంతో కంట్రోల్ గదిని పైన మల్కపేట జలాశయం పక్కన నిర్మించారు. దీనికి అదనంగా రూ.50 కోట్లు ఖర్చయింది. సొరంగంలో నీటిని తోడేందుకు ఇతర పనులకు రూ.7 కోట్ల వరకు అదనపు చెల్లింపులు చేశారు. మొత్తంగా ప్రాజెక్టు వ్యయం రూ.996 కోట్లకు పెరిగింది.

పాత సంస్థకే రెండోసారి పనులు

మధ్యమానేరు జలాశయం పనుల్లోనూ గుత్తేదారు సంస్థలకు పనుల ఒప్పందంలో నిబంధనలు పాటించకపోవడం వల్ల రూ.224 కోట్ల ప్రజాధనం నష్టం వాటిల్లిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. జలాశయం పనులు జరుగుతుండగా 2016 సెప్టెంబరులో మానేరు, మూలవాగులో భారీగా వరదలు రావడంతో స్పిల్‌వే ఎడమవైపు మట్టికట్ట కొట్టుకుపోయింది. నాణ్యత లేని పనులతోనే కొట్టుకుపోవడంతో ఈ నష్టాన్ని గుత్తేదారు సంస్థనే భరించాలి. కానీ అప్పటి ప్రభుత్వం నోటీసులు ఇచ్చి సరిపెట్టింది.

గత ప్రభుత్వం 2016లో మరోసారి టెండర్లు పిలిచింది. జాయింట్ వెంచర్‌గా ఏర్పడిన రెండు గుత్తేదారు సంస్థలు జలాశయం నిర్మాణ పనులు దక్కించుకున్నాయి. అందులో ఒకటి పాత నిర్మాణ సంస్థ కావడం గమనార్హం. నాణ్యత లోపంతో పనులు చేపట్టి మట్టి కట్టకు గండిపడేందుకు కారణమైన సంస్థపై చర్యలు తీసుకోకపోగా, తిరిగి అదే సంస్థకు పనులు అప్పగించడంపై ఇంజినీర్ల సహకారం ఉందనే ఆరోపణలు ఉన్నాయి.

కుడిమట్టి కట్ట నిర్మాణానికి పాత ధరలు, గండిపడిన ఎడమవైపు 2016లోని కొత్త ధరల ప్రకారం చెల్లింపులు చేసి గుత్తేదారు సంస్థకు అనుకూలంగా వ్యవహరించారనే విమర్శలున్నాయి. వీటికి సంబంధించి ప్రాజెక్టుల స్టాండింగ్ కమిటీ తీర్మానాలు, ఆర్థిక సంఘం నిధుల మంజూరు తదితర దస్త్రాలను విజిలెన్స్ బృందం సేకరించింది. విచారణ తర్వాత గుత్తేదారులకు చెల్లించిన అదనపు నిధులకు ప్రభుత్వ అనుమతులు ఉన్నాయా? ఇంజినీర్ల ప్రమేయం ఏ మేరకు ఉందనే దానిపై స్పష్టత వస్తుంది.

## గ్రేటర్‌లో తొలుత 'సారథి'

హైదరాబాద్ : రవాణాశాఖ ఆన్‌లైన్ సేవలకు సంబంధించి కొత్త పోర్టల్ 'వాహన్-సారథి'లో తొలుత గ్రేటర్‌లో సారథిని అమలు చేయనున్నారు. ఈ నెల ఒకటి నుంచి సికింద్రాబాద్ రవాణాశాఖ నుంచి ప్రయోగాత్మక పరిశీలన కింద అమలు చేసేందుకు అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. తర్వాత దశల వారీగా గ్రేటర్‌లోని అన్ని కార్యాలయాల్లో అమలు చేయనున్నట్లు తెలుస్తోంది. దేశ వ్యాప్తంగా రవాణా సేవలన్నింటిపై ఏకీకృతమైన విధానాన్ని అమలు చేసేందుకు గతంలో వాహన్-సారథి సేవలను అందుబాటులోకి తెచ్చారు. ఇప్పటికే పలు రాష్ట్రాలు ఇందులో భాగస్వామ్యం అయ్యాయి. ఇటీవల తెలంగాణ కూడా పచ్చజెండా ఊపింది. డ్రైవింగ్ లైసెన్సు వివరాలన్నీ 'సారథి'లో, వాహనాల వివరాలను 'వాహన్'లో నమోదు చేయనున్నారు. ఈ నేపథ్యంలో తొలుత సారథి సేవలను గ్రేటర్‌లో అందుబాటులోకి




తేవాలని భావిస్తున్నారు.

ఇవీ ప్రయోజనాలు...సారథితో లైసెన్సుల జారీ ఇతరత్రా సేవలు పూర్తిస్థాయిలో ఆన్‌లైన్‌లో అందుబాటులోకి రానున్నాయి.

ఎల్ఎల్ఆర్ సైతం ఇక నుంచి ఆన్‌లైన్‌లోనే పొందే అవకాశం ఉంది. ఇప్పటికే ఈ విధానాన్ని కర్ణాటకలో విజయవంతంగా అమలు చేస్తున్నారు. పాత డ్రైవింగ్ లైసెన్సు రెన్యువల్ చేసుకోవడం, చిరునామా, మార్పులు, చేర్పులు లాంటి సేవలతోపాటు ఒక జిల్లా నుంచి మరో జిల్లా లేదా రాష్ట్రానికి బదిలీ అయినప్పుడు డ్రైవింగ్ లైసెన్సులను కూడా 'సారథి' ద్వారా సులువుగా ఆన్‌లైన్‌లోనే కల్పించనున్నారు.

ఈ సేవల కోసం ఆన్‌లైన్‌లో ఫీజులు, నిర్ణీత డాక్యుమెంట్లు అప్‌లోడ్ చేస్తే సరిపోతుంది. ఇది విజయమైంతన తర్వాత వాహన్ పోర్టల్‌ను సైతం అందుబాటులోకి తేనున్నారు. ఫలితంగా మొత్తం వాహనాల డేటా ఆన్‌లైన్‌లో అందుబాటులోకి రానుంది.

## పంచాయతీ.. మున్సిపాలిటీల లేఅవుట్లపై నజర్

హైదరాబాద్: చెరువులు..జలవనరుల సంరక్షణకు హైడ్రా తరహా వ్యవస్థను జిల్లాలకు విస్తరించనున్న నేపథ్యంలో రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని గ్రామాలు..మున్సిపాలిటీల్లో ఇళ్ల నిర్మాణం కోసం వేసిన లేఅవుట్లపై రెవెన్యూ అధికారులు దృష్టి సారించారు. ప్రధానంగా మేజర్ పంచాయతీల నుంచి మున్సిపాలిటీలు, కార్పొరేషన్లుగా మారిన వాటిలో తొలుత సర్వే నిర్వహిస్తారు. బఫర్ జోన్‌లు..ఎఫ్‌టీఎల్‌లలో అనుమతులిచ్చిన సంస్థలకు లేఖలు రాశారు. స్థానిక ఇరిగేషన్ అధికారులు ఆయా ప్రాంతాలకు వెళ్లి డిజిటల్ జీపీఎస్ సర్వేలు, గ్రామ నక్షాలు సరిపోల్చనున్నారు. చెరువుల బఫర్‌జోన్లలో కొందరు వెంచర్లు వేశారన్న ఫిర్యాదులతో ఈ నిర్ణయం తీసుకున్నారు. జీహెచ్ఎంసీకి



సమీపంలోని మేజర్ గ్రామాల్లోని చెరువులకు సమీపంలోని పట్టా భూములను కొందరు కొనుగోలు చేసి.. ఎఫ్‌టీఎల్ స్థలాలను కలిపేసుకున్నారు. నిర్మాణాలకు అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించకుండా అనుమతులివ్వడంతో చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లు లే-అవుట్లలో కలసిపోయాయి. ఇలాంటి లే అవుట్లపై అధికారులు దృష్టిపెట్టనున్నారు.

## మూసీ ప్రక్షాళనకు కొత్త ఎస్టీపీలు!

హైదరాబాద్: మూసీ ప్రక్షాళన విషయంలో ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. ఇప్పటికే మూసీకి ఇరువైపులా హైదరాబాద్‌లో 1595, మేడ్చల్ మల్కాజిగిరి 239, రంగారెడ్డిలో 332 నిర్మాణాలు ఎఫ్‌టీఎల్‌లో ఉన్నట్లు తేల్చారు. నిర్వాసితులకు రెండు పడక గదుల ఇళ్లు కేటాయించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ఒకవైపు ఆక్రమణల తొలగింపు.. మరోవైపు మురుగునీటిని శుద్ధి చేయడం కొనసాగించాలని నిర్ణయించింది. కేంద్ర ప్రభుత్వం అమృత స్కీంలో భాగంగా ప్రభుత్వంతోపాటు గుత్తేదారు భాగస్వామ్యం కింద హైబ్రిడ్ యాన్యునిటి పద్ధతి(హామ్)లో కొత్తగా 39 ఎస్టీపీలను నిర్మించనున్నారు. అవుటర్ రింగ్ రోడ్డు వరకు మురుగు కలిసే మూసీతోపాటు చెరువులు, కుంటల వద్ద వీటిని ఏర్పాటు చేయనున్నారు. ఈ నెలాఖరులోపు టెండర్లు ఆహ్వానించేందుకు జలమండలి సిద్ధమవుతోంది. మొత్తం రూ.3849.10 కోట్లతో 972 మిలియన్ లీటర్ల సామర్థ్యంతో 39 ప్రాంతాల్లో నిర్మించనున్నారు. కేంద్రం 40శాతం, గుత్తేదారు సంస్థ, జలమండలి కలిసి 60శాతం నిధులు వెచ్చిస్తాయి. భూసేకరణ ఇబ్బంది లేకుండా చిన్నచిన్న కేంద్రాలను ప్రభుత్వ భూముల్లో ఎక్కువ నిర్మించనున్నారు. ప్రస్తుతం గ్రేటర్‌వ్యాప్తంగా ఉన్న ఎస్టీపీల ద్వారా 750 మిలియన్ లీటర్ల మురుగును శుద్ధి చేస్తున్నారు. ఇవి కాకుండా 31 ఎస్టీపీలు సిద్ధమవుతున్నాయి.

# పాత పాత్రలకు చెల్లు

పాల్వంచ : పిల్లలకు పోషకాహారం అందించడమే మధ్యాహ్న భోజన పథకం లక్ష్యం. అయితే వివిధ విద్యా లయాల్లో పాత పాత్రల్లో చేస్తున్న వంటకాలు ఒక్కోసారి నాణ్యంగా ఉండటం లేదు. ముఖ్యంగా అన్నం నాణ్యంగా లేక కొందరు విద్యార్థులు ఆకలి తీరేలా భోజనాన్ని ఆరగించలేక పోతున్నారు. ఇంకొందరు తిన్నాక ఇబ్బంది పడుతున్నారు. ఈనేపథ్యంలో కొత్త వంట పాత్రలు కొనాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లోని 1,198 పాఠశాలలకు రాష్ట్ర విద్యాశాఖ నుంచి రూ. 2.37కోట్లు విడుదలయ్యాయి. పథకం ప్రారంభమైనప్పటి నుంచి వాడుతున్న పాత్రలను పక్కనపెడితేనే నాణ్యమైన భోజనం వండటం.. వడ్డించటం వీలవుతుంది.

మధ్యాహ్న భోజన నిర్వాహకులు.. వంట పాత్రలు కొనేందుకు విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా విద్యాశాఖ నిధులు కేటాయించింది. అన్నం, కూరలకు వేర్వేరుగా సమకూర్చుకోవాలి. మండలం వారీగా ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలకు అక్కడి విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా నిధులు కేటాయించనున్నట్లు విద్యాశాఖ



అధికారులు తెలిపారు. ఇందుకోసం బహిరంగ టెండర్ ఆహ్వానించాలని యోచిస్తున్నారు.

ఐదేళ్లకోసారి మార్చాలనేది నిబంధన

ముమ్మడి వెంకటేశ్వరా చారి, డీఈవో, భద్రాద్రి

మధ్యాహ్న భోజన ఏజెన్సీలు వంట పాత్రలను ఐదేళ్లకోసారి మార్చాలనే నిబంధన ఉంది. కానీ ఇన్నాళ్లూ అది సాధ్యం కాలేదు. అన్నం అడుగంటిపోతున్నా అలాగే వడ్డిస్తున్నారనే ఫిర్యాదులు తరచూ అందుతున్నాయి. ఈ సమయంలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ఎంతో మేలు చేయనుంది.

పాఠశాలలు నిధులు

ఖమ్మం 902 రూ. 1.16 కోట్లు

భద్రాద్రి 1,016 రూ. 1.21 కోట్లు

విద్యార్థుల సంఖ్య కేటాయించే నిధులు (రూ.ల్లో)

50 - 10,000

51-150 15,000

151-250 20,000

251-ఆపైన 25,000

# ఒప్పందానికి తూట్లు.. రైతులకు నష్టాలు..!

కొణిజర్ల : గతేడాది కొణిజర్ల మండలంలో విత్తన మొక్కజొన్న దిగుబడులు ఐదు క్వింటాళ్లకు మించలేదు. ఏజెంట్లు అందుబాటులో లేకపోవటంతో దిగుబడిని తక్కువ ధరకు విక్రయించి రైతులు నష్టపో యారు. కొణిజర్ల, చింతకాని మండలాల్లో గతేడాది పంట ఉత్పత్తులు విక్రయించినా సొమ్ము అందక రైతులు ఇంకా ఇబ్బందులు పడుతు న్నారు. పత్తిలో నష్టాలు వస్తుండటంతో యాసంగిలో మొక్కజొన్న సాగుకు రైతులు మొగ్గుచూపుతున్నారు. ఈ సమయంలో విత్తన మొక్కజొన్న వేయాలంటూ గ్రామాల్లో ఏజెంట్లు చక్కర్లు కొడతారు. ప్రముఖ సంస్థలు.. ఏజెంట్లను నియమించుకొని విత్తన సాగు చేపట్టేలా రైతులను ప్రలోభాలకు గురిచేస్తాయి. నమ్మి సాగుచేస్తే దిగుబడులు రాక, ఏజెంట్లు అందుబాటులో లేక అన్నదాతలు నట్టేట మునుగుతున్నారు. మూడేళ్లుగా ఇదే తంతు నడుస్తోంది.

**దిగుబడి వస్తే సరే..**

ఈ ఏడాదీ విత్తన మొక్కజొన్న సాగు చేయాలంటూ ఏజెంట్లు గ్రామాల్లో



తిరుగుతున్నారు. 10-20 మంది రైతులను గ్రూపుగా చేసి విత్తన మొక్కజొన్న సాగుకు ఒప్పిస్తున్నారు. ప్రముఖ విత్తన సంస్థల ప్రతినిధులు ఎవరూ రైతులను నేరుగా కలవరు. ఏజెంట్లు తొలుత సన్నకారు రైతులకు వలవిసురుతారు. ముందుగా పెట్టుబడి పెడతామని, విత్తనాలు, ఎరువులు ఇస్తామని ఆశచూపుతారు. వారిని నమ్మి సాగుచేస్తే మంచిగా దిగుబడులు వస్తే రైతులకు అందుబాటులో ఉంటారు. లేకుంటే కనిపించకుండా పోతారు.

**అమాయక రైతులను మోసగిస్తున్న సంస్థలు**

విత్తన మొక్కజొన్న సాగు చేస్తే ఎన్ని క్వింటాళ్ల దిగుబడి వస్తుంది, క్వింటాకు ఎంత ధర లభిస్తుందనే వివరాలను సదరు సంస్థ ముందే రైతులకు తెలపాలి. ఈమేరకు ఒప్పందం కుదుర్చుకోవాలి. ఇక్కడే సంస్థలు అమాయక రైతులను మోసగిస్తున్నాయి. రైతు పండించిన పంట తమకే విక్రయించాలని, వేరేవారికి అమ్మితే న్యాయపరమైన చిక్కులు తప్పవంటూ ఒప్పంద పత్రంలో పొందుపరిచి అన్నదాతలను కట్టడి చేస్తున్నాయి. ఈ పరిస్థితి వల్ల విత్తన మొక్కజొన్న సాగుచేసే రైతులు ఆర్థికంగా చితికిపోతున్నారు. కొణిజర్ల, చింతకాని, బోనకల్లు, తల్లాడ, వైరా, మధిర, రఘునాథపాలెం తదితర మండలాల్లో 4,800 మంది రైతులు 15 వేల ఎకరాల్లో విత్తన మొక్కజొన్న సాగు చేస్తున్నారు.

**తీసుకోవాల్సిన జాగ్రత్తలు**

విత్తనాలకు సంబంధించి ఏజెంట్లు రసీదులు ఇవ్వరు, కావున ఒప్పందం కుదుర్చుకోవటం తప్పనిసరి. దిగుబడి ఎంతొస్తుంది..? ధర ఎంతనేది రూ. 100 బాండ్‌పేపర్‌పై ఒప్పందం చేసుకోవాలి. సంస్థ చెప్పిన దిగుబడి రాకుంటే పరిహారమివ్వాలనే నిబంధన పెట్టాలి.

ఏజెంట్ ఏగ్రామానికి చెందినవాడు, ఆయనకు సంబంధించిన ఇతర వివరాలు రైతులకు తెలిసి ఉండాలి.

ఒప్పందం ఉంటే దాని ద్వారా స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసి చట్టపరంగా న్యాయం పొందవచ్చు

విత్తన మొక్కజొన్న సాగుచేసే రైతులు అప్రమత్తంగా ఉండాలి. రెండేళ్లుగా ఈ పంట సాగుతో అధిక మంది అన్నదాతలు నష్టపోయారు. ఏజెంట్ల మాటలు నమ్మి సాగుచేస్తే ఇబ్బందులు తప్పవు. ఒప్పందం కుదుర్చుకున్నాకే సాగుకు పూనుకోవాలి. బాలాజీ, మండల వ్యవసాయశాఖ అధికారి, కొణిజర్ల

# ‘మాయదారి’ లింక్‌లు



హైదరాబాద్ : నగరంలో సామాన్యుడి నుంచి సంపన్నుడి వరకూ పెరుగుతున్న ఆర్థికభారాన్ని అధిగమించేందుకు అదనపు ఆదాయం కోసం వెతుకుతున్నారు. రెండు చేతులా సంపాదించాలనే ఉద్దేశంతో సామాజిక మాధ్యమాల్లో వచ్చే లింక్‌లకు స్పందిస్తూ, మాయగాళ్ల వలలో చిక్కుతున్నారు. ఎలా ఇరికిస్తారంటే.. పాన్, డీమ్యాట్ ఖాతా అవసరం లేకుండానే యాప్‌లో పెట్టుబడి అంటారు.. లాభాలకు పన్ను చెల్లించాల్సిన అవసరం లేదనే ప్రకటనలతో నమ్మిస్తారు. నకిలీ యాప్‌లు, వెబ్‌సైట్లు, వాట్సాప్ గ్రూప్‌ల్లో అమాయకులు తెలియక చేరుతున్నారు. ఆయా గ్రూప్‌లో అంతర్జాతీయ మార్కెట్, క్రిప్టో కరెన్సీలో పెట్టుబడులకు 100 శాతం లాభం వచ్చిందంటూ ఒక సభ్యుడు బ్యాంకు ఖాతాలో నగదు జమైనట్లు స్క్రీన్‌షాట్ పోస్ట్ చేస్తాడు. మరో సభ్యుడు తనకు వచ్చిన రాబడితో రూ. 50 లక్షల కారు కొన్నట్లు ఫొటో ఉంచుతాడు. మోసగాళ్లే ఇలా తప్పుడు ప్రచారం చేస్తున్నట్లు తెలియని సభ్యులు.. నమ్మేస్తున్నారు. ఇదే సరైన వేదిక అనే ఆలోచనతో సొంతూళ్లలో ఉన్న స్థలాలు, భూములు విక్రయించి వచ్చిన సొమ్మును పెట్టుబడి పెడుతున్నారు. ఈ ఏడాది 10 నెలల వ్యవధిలో సుమారు 1000 మంది ఇన్వెస్ట్‌మెంట్ మోసాల్లో రూ. 60 కోట్ల మేర నష్టపోయినట్లు అంచనా.

**ఘటనలిలా..**

ఖైరతాబాద్‌కు చెందిన వ్యాపారి (57) సామాజిక మాధ్యమాల్లో కనిపించిన ఎం.స్టాక్ ట్రేడింగ్ కంపెనీ ప్రకటనకు ఆకర్షితుడై రూ. 23 లక్షలు పెట్టుబడి పెట్టాడు. నగదు ఉపసంహరించుకునే మార్గం లేకపోవడంతో మోసపోయినట్లు గ్రహించాడు.

బంజారాహిల్స్‌కు చెందిన వ్యాపారి (35) వాట్సాప్ నంబర్‌కు వచ్చిన లింక్ ద్వారా జీ02 బార్‌క్లేస్ స్టాక్ పుల్‌లో ప్రీమియం సభ్యుడిగా చేరాడు. రూ. 2 లక్షలు పెట్టుబడి పెట్టి మోసపోయాడు.

బేగంపేటకు చెందిన ఉద్యోగి(49) గూగుల్ యాడ్ ద్వారా జప్ఫరీస్ వెల్త్ మల్టిప్లికేషన్ గ్రూప్‌ను సంప్రదించాడు. రూ. 21 లక్షలు పెట్టుబడి పెట్టి నష్టపోయాడు.

తెలియని వ్యక్తులు.. సంస్థల ప్రకటనలు నమ్మొద్దు:

కవిత దార, సైబర్‌క్రైమ్ డీసీపీ వెబ్‌సైట్లు, యాప్‌ల్లో కనిపించే స్టాక్‌మార్కెట్, ఇన్వెస్ట్‌మెంట్ ప్రకటనలు నమ్మి ఎక్కువమంది మోసపోతున్నారు. ఏ రంగంలోనూ రోజులు, నెలల వ్యవధిలో 100, 200 శాతం లాభాలు రావు. వాట్సాప్ గ్రూపులు, సందేశాలు, మెయిల్స్‌కు వచ్చే అనుమానాస్పద లింక్‌లు, సమాచారాన్ని నమ్మొద్దు. మోసపోతే వీలైనంత తక్కువ సమయంలో 1930 నంబర్‌కు ఫిర్యాదు చేస్తే, సొమ్ము వెనక్కి రప్పించే అవకాశం ఉంటుంది.

# ప్రణాళిక.. అభివృద్ధికి సూచిక



కరీంనగర్ : పట్టణాలు, నగరాలు దినదిన అభివృద్ధి చెందుతున్నాయి. ఉపాధి అవకాశాలు, నాణ్యమైన విద్య కోసం పల్లెల నుంచి అక్కడకు పరుగులు పెడుతున్నారు. జనాభాకుతోడు వాటి విస్తీర్ణమూ పెరుగుతూ వస్తోంది. కొత్త కాలనీలూ వెలుస్తున్నాయి. చుట్టుపక్క గ్రామాలూ విలీనమవుతున్నాయి. ఆ ప్రాంతాల్లో భవన నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడం, అక్రమ కట్టడాలు తొలగించడం, నగర, పురపాలికల వీధి. ఆ బాధ్యతను పట్టణ ప్రణాళిక విభాగం చూస్తోంది. నేడు ప్రపంచ పట్టణ ప్రణాళిక దినోత్సవం సందర్భంగా ప్రస్తుత పరిస్థితిని వివరిస్తూ.. ఎలాంటి లోపాలున్నాయి. వాటిని ఎలా అధిగమించాలో వివరిస్తూ ‘న్యూస్‌టుడే’ ప్రత్యేక కథనం.

కరీంనగర్, రామగుండం నగర పాలక సంస్థలు, పట్టణాల్లో పట్టణీకరణ పెరిగింది. గ్రామాలు పంచాయతీలుగా.. పంచాయతీలు పురపాలికలుగా హోదా పెరుగుతుండటంతో వలసలు పెరిగాయి. జనాభాకు పెరగడంతో ఎక్కడ స్థలం కనిపిస్తే చాలు అక్కడ భవనాలు వెలుస్తున్నాయి. సామాజిక అవసరాల కోసం రహదారులు, మురుగుకాలువలు, ఉద్యానవనాలు, ప్రభుత్వ స్థలాలు, పాఠశాలలు, ఆసుపత్రులు వంటివి ఉండాలంటే బృహత్తర ప్రణాళికలు అవసరం. 20 ఏళ్లకు ఒకసారి ప్రణాళికలు అమలు కావాల్సి ఉండగా పాతికేళ్లు దాటినా ఆ ఊసే లేకుండా పోతోంది.

**లక్ష్యాల నిర్దేశం..**పట్టణ ప్రాంతాల్లో భవిష్యత్తును రూపొందించడానికి, లక్ష్యాలను నిర్దేశించుకోవాలి. పౌరుల జీవన పరిస్థితులను మెరుగుపర్చడానికి వసతులు కల్పించాలి. చిన్న పట్టణాలకు ఆర్థికాభివృద్ధి అందించేలా ఉంటుంది.

భవన నిర్మాణాలు, పాదచారులు, పార్కులు నిర్మించుకోవడానికి వినియోగించుకునే వీలుంది. ప్రభుత్వ, ప్రైవేటు స్థలాలు ఇందులోకి వినియోగించుకోవచ్చు. - పట్టణాలు, నగరాల్లో రహదారి విస్తీర్ణం, పారిశ్రామిక అభివృద్ధి, పచ్చదనం పెంచుకోవడానికి అవకాశముంటుంది.

మాస్టర్‌ప్లాన్ అమలు చేయడం ద్వారా భవిష్యత్తు అవసరాలకు ఉపయోగపడేలా అన్ని రకాల ప్రణాళికలు అమల్లోకి వస్తాయి. పెరుగుతున్న జనాభాను లెక్కల్లోకి తీసుకొని అభివృద్ధి చేసుకోవచ్చు. భవన నిర్మాణాలు, పారిశ్రామిక సంస్థల ఏర్పాటు ద్వారా ఆర్థికాభివృద్ధి జరుగుతుంది.

పర్యావరణం పెంచడం, వాతావరణ కాలుష్యం నుంచి విముక్తి కల్పించేందుకు ప్రణాళికలు ఉండనున్నాయి. - సహజ సంపద, చారిత్రక కట్టడాలను పరిరక్షించాలి.

ప్రజల్లో అవగాహన ప్రధానం

కార్పొరేషన్లు, పురపాలికల్లో భవన అనుమతుల నిబంధనలు పాటిస్తే ఎలాంటి సమస్యలు ఉండవు.

అక్రమ నిర్మాణాలతో అనేక అనర్థాలు ఉంటాయి. ఈ మధ్య వీటి సంఖ్య పెరిగింది. అదనంగా అంతస్తులు నిర్మించడం, పార్కింగ్ వదలకపోవడం వంటి నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు. ఇలాంటి వాటికి బ్యాంకులు రుణాలు ఇవ్వవు. భవనానికి ఆస్తిపన్నులో జరిమానా మదింపు ఎప్పటికి ఉంటుంది. లేఅవుట్లకు అనుమతి తీసుకుంటే రోడ్లు, డ్రైనేజీలు, పార్కులు, ఇతర సామాజిక అవసరాలకు స్థలాలు వదిలిపెడతారు. రియల్ ఎస్టేట్ వ్యాపారులు పెద్ద పెద్ద స్థలాలు ముక్కలు చేసి విక్రయించడంతో వాటిని కొన్న ప్రజలు నష్టపోతున్నారు.

ఇళ్లను నిర్మించుకునే సమయంలో కచ్చితంగా 30 అడుగుల రహదారి ఉండేలా చూసుకోవాలి. అనుమతి ప్లాన్ ప్రకారం సెట్‌బ్యాక్, సెల్లార్ వంటి సౌకర్యాలు కల్పించాలి.

# కార్మికులకేదీ.. వైద్య భరోసా?



కొత్తగూడెం : ప్రస్తుత అంచనాల ప్రకారం ఉమ్మడి జిల్లాలో కార్మిక బీమా వైద్య సదుపాయం వర్తించే వారు సుమారు 25 వేల మంది ఉన్నారు. వారి కుటుంబ సభ్యులందరినీ లెక్కిస్తే అర్హుల జాబితా లక్షకు చేరుతుంది. వీరంతా సారపాకలోని ఏకైక ఈఎస్‌ఐ వైద్యశాల పరిధిలోకి వస్తారు. కానీ, సమీప ప్రాంతాల వారికే వైద్యం అక్కరకు వస్తోంది. ఒప్పంద కార్మికులకు ప్రభుత్వ వైద్యం అందని ద్రాక్షగా మారుతోంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ప్రస్తుతం బూర్గంపాడు మండలంలోని సారపాకలో మాత్రమే ఉద్యోగుల స్టేట్ ఇన్సూరెన్స్ (ఈఎస్‌ఐ) డిస్పెన్సరీ కొనసాగుతోంది. రెండు జిల్లాల నుంచి అంతదూరం వెళ్లలేని ఒప్పంద ఉద్యోగులు, కార్మికులు ఆర్థిక భారమే అయినా ప్రైవేటు వైద్యాన్ని ఆశ్రయిస్తున్నారు. కొత్తగూడెంలో కొత్తగా మరో ఈఎస్‌ఐ వైద్యశాలను ప్రారంభిస్తే చాలామందికి న్యాయం జరుగుతుంది.

తొమ్మిదేళ్ల క్రితం తరలింపు..కొత్తగూడెం రామవరంలోని డిస్పెన్సరీనే తొమ్మిదేళ్ల క్రితం సారపాకకు మార్చారు. పారిశ్రామిక ప్రాంతమైన కొత్తగూడెం, పాల్వంచ వాసులకు ఈఎస్‌ఐ సేవలు దూరమయ్యాయి. కొత్తగూడెంలో మరొకటి ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనను పరిశీలించేందుకు గత జనవరిలో కార్మిక బీమా సంస్థ అధికారులు వచ్చారు. రామవరం, రుద్రంపూర్ ప్రాంతాల్లో పలు సింగరేణి క్వార్టర్లను పరిశీలించారు. ఆ తర్వాత ఈ విషయంపై ఎలాంటి పురోగతి లేదు. ‘రామవరం డిస్పెన్సరీని ఈఎస్‌ఐ వైద్య సేవలకు అందించేందుకు తాము సిద్ధమే’ అని కొత్తగూడెం ఏరియా జీఎం షాలేమురాజు తెలిపారు.

“ఈఎస్‌ఐ డిస్పెన్సరీ ఏర్పాటులో జాప్యం తగదు. గతంలో ఇక్కడున్న వైద్యశాలను తరలించి తప్పిదం చేశారు. కొత్తగా మరొకదాన్ని ఏర్పాటు చేస్తేనే ప్రస్తుత వైద్య అవసరాలు తీరతాయి.”రాసూరి శంకర్, కాంట్రాక్టు కార్మికుల హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు

“దేవుడు వరమిచ్చినా పూజారి అడ్డుకొన్నట్లుంది సింగరేణి అధికారుల వైఖరి. డిస్పెన్సరీ ఏర్పాటుకు తగిన క్వార్టర్‌ను కేటాయించాలని ఈఎస్‌ఐ సింగరేణి ప్రధాన కార్యాలయానికి లేఖ రాసి ఆర్నెల్లు దాటుతోంది. నేటికీ దీనిపై ఉభయ వర్గాల అధికారులు స్పందించడం లేదు.”

బి.మధు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సింగరేణి కాంట్రాక్టు కార్మికుల సంఘంఉచిత వైద్య సేవలు పొందేందుకు రూ. 21 వేల లోపు వేతనంపై పనిచేసే కార్మికోద్యోగులై ఉండాలి. అంగవైకల్యం ఉన్నవారైతే రూ. 25 వేల లోపు వేతనం పొందాల్సి ఉంటుంది.

# తరాలు మారినా.. తీరని అవస్థలు

పినపాక: ఆసుపత్రికి తరలిస్తున్న ఆదివాసీ గర్భిణి మార్గంమధ్యలో ప్రసవించిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలంలోని వలస ఆదివాసీ గ్రామమైన ఉమేశ్‌చంద్రనగర్‌కు చెందిన మడవి అనితకు బుధవారం పురిటినొప్పులు రావడంతో సమీపంలోని జానంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించేందుకు కుటుంబ సభ్యులు సిద్ధమయ్యారు. గ్రామానికి రోడ్డు మార్గం లేకపోవడంతో 2 కి.మీటర్ల దూరంలోని రెడ్డిగూడెం వరకు జెట్టీలో తీసుకువ



స్తామని, అక్కడ రోడ్డుపై ఆగాలని 108 వాహనానికి సమాచారం అందించారు. 1.5 కి.మీటర్లు జెట్టీలో వచ్చిన తర్వాత గర్భిణికి నొప్పులు అధికమయ్యాయి. గమనించిన స్థానిక మహిళ మడవి పార్వతమ్మ అడవిలో పురుడుపోశారు. బాబు జన్మించారు. అనంతరం మరో అర కి.మీటరు జెట్టీలో ప్రధాన రహదారికి చేరుకున్న ఇరువురిని అక్కడికి వేచి ఉన్న 108 వాహనంలో జానంపేట ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స అందించిన వైద్యురాలు శృతి ఇద్దరు ఆరోగ్యంగానే ఉన్నట్లు వెల్లడించారు. చిన్నారికి టీకా వేశారు.

# పంకాలు తిరగవు.. లిఫ్ట్ నడవదు!

ఖమ్మం : ఖమ్మం సర్వజనాసుపత్రి మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో చిన్నచిన్న సమస్యలకు రోజుల తరబడి పరిష్కారం లభించడం లేదు. బాలింతలు, పిల్లలు చికిత్స పొందుతున్న వార్డుల్లో కొన్ని పంకాలు తిరగడం లేదు. గాలి కోసం ఇంటి నుంచి సొంత పంకాలు తెచ్చుకొని వినియోగిస్తున్నారు. కొన్ని మంచాలపై పరుపులు పాడైపోయాయి. శస్త్ర చికిత్సలతో కాన్పు చేయించుకున్న బాలింతలు కనీసం వారం పాటు ఆస్పత్రిలో ఉండాలి. వార్డుల్లో తగిన సదుపాయా



లు లేక ఇబ్బంది పడుతున్నారు. ఇంకోవైపు ఖాళీగా ఉన్న వార్డుల్లో పంకాలు తిరుగుతున్నా, విద్యుద్దీపాలు వెలుగుతున్నా వృథాను అరికట్టేవారు లేరు. పైఅంతస్తులకు వెళ్లేందుకు ఏర్పాటుచేసిన లిఫ్ట్ రెండు నెలలుగా పనిచేయడం లేదు. ఈఅంశంపై మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌తో మాట్లాడుతూ బాలింతలకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసకుంటామన్నారు.

# హైటెన్షన్ బతుకులు

బోథ్ : బోథ్ నియోజకవర్గ పరిధిలోని పలు ప్రాంతాల్లో కాలనీలు, బస్తీలు, మురికివాడల మధ్య నుంచి హైటెన్షన్ విద్యుత్తు తీగలు ప్రమాదకరంగా కొనసాగుతున్నాయి. స్థానికులు కొన్నేళ్లుగా బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. తమ ఇబ్బందులపై ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందన కరవైందని వాపోతున్నారు.

బోథ్ నియోజకవర్గ పరిధిలోని ఇచ్చోడ, గుడిహత్నూర్, తలమడుగు, బజార్‌హత్నూర్, సిరికొండ మండలంలోని పలు గ్రామాల మీదుగా 11 కేవీ, మరోవైపు 33 కేవీ హైటెన్షన్ విద్యుత్తు తీగలు వెళ్తున్నాయి. ఈ తీగలతో గతంలో కొందరు ప్రాణాలు కోల్పోగా.. మరికొందరు గాయాల పాలయ్యారు. పదేళ్ల కిందట కొన్ని గ్రామాల్లో వేలాడుతున్న తీగలను సరిచేశారు. గ్రామాల్లో ఉన్న విద్యుత్తు లైన్లు తొలగించాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈదురుగాలులు, భారీ వర్షాలు కురిసినప్పుడు కరెంటు సరఫరాలో హెచ్చుతగ్గులు ఏర్పడి ఇళ్లలోని గృహోపకరణాలు కాలిపోతున్నాయని వారంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హైటెన్షన్ తీగల కారణంగా ఎప్పుడు ఎలాంటి



ప్రమాదం జరుగుతుందోనని ఆవేదన వ్యక్తం చేశారు.

**వేలాడుతున్న తీగలు..**

గుడిహత్నూర్ మండలంలోని మన్నూర్, లింగాపూర్, గుడిహత్నూర్‌లో సర్వీస్ తీగలు సైతం నిర్వహణ లేక వేలాడుతున్నాయి. కొన్ని చోట్ల ఇళ్ల గోడలకు తాకేలా ప్రమాదకరంగా కొనసాగుతున్నాయి. సంబంధిత తీగలను తక్షణం సరిచేసి ప్రమాదాలను నివారించాలని అక్కడి నివాసితులు కోరుతున్నారు.

**ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం**

అనిల్ జాదవ్, బోథ్ ఎమ్మెల్యే

కాలనీలు, బస్తీల మధ్య నుంచి వెళ్తున్న 33 కేవీ, 11 కేవీ హైటెన్షన్ కరెంటు తీగల సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. నియోజకవర్గంలోని అనేక గ్రామాల్లో ఇలాంటి సమస్యలు ఉన్నాయి. త్వరలో విద్యుత్తు హైటెన్షన్ సమస్య పరిష్కరించడానికి కృషి చేస్తాను.

**పక్కా గృహాలు నిర్మించలేకపోతున్నాం..**

రాము కదం, మన్నూర్

మన్నూర్ పంచాయతీలోని బీసీ కాలనీలోని పలువురి ఇళ్లపై నుంచి 11 కేవీ, 33 కేవీ విద్యుత్తు లైన్లు ఉండటంతో ప్రజలు పక్కా గృహాలు నిర్మించుకోవడం కోసం ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది.

# ఆరోగ్యానికి చిరు ధాన్యం

జగిత్యాల : ఉమ్మడి జిల్లాలో ఇటీవల కొందరు రైతులు చిరుధాన్యాల సాగును కొద్ది విస్తీర్ణంలో చేపట్టి విస్తరిస్తున్నారు. ప్రస్తుతం చిరుధాన్యాలను ఇతర రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకొని అధిక ధరకు విక్రయిస్తుండగా.. సాగు పెరిగితే వినియోగదారులకు సరసమైన ధరలోనే అందుబాటులోకి వస్తాయి, రైతులకూ విక్రయ అవకాశాలు పెరుగుతాయి. ఇప్పటికే పలు ప్రాంతాల్లో రాగి జావ, జొన్న అంబలి, మక్క గట్క, ఉలవచారు, కొర్రల కిచిడీ, సామల ఉప్మా, జొన్న రొట్టె, పాయసం, సూప్, గుడాలు, చిరుధాన్యాల మిశ్రమపిండితో రొట్టెలు, వడ, బిర్యానీ, బజ్జీలు, కీర్, ఉప్మా, కట్లెట్, దోశ, ఇడ్లీలు తయారు చేసి విక్రయిస్తుండటం, ఇళ్లలోనూ వీటివాడకం క్రమంగా పెరుగుతోంది. వీటితో బిస్కెట్లు, మురుకులు తదితరాలను తయారు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా నేలలు వీటి సాగుకు అనువుగా ఉండగా యాసంగిలో పండించదగిన ఈ పంటల విత్తనాలను ప్రభుత్వం రాయితీపై ఇవ్వటం, మహిళా సంఘాల ద్వారా ఉత్పత్తుల కొనుగోలు, ఉపఉత్పత్తుల తయారీ తదితరాలతో ప్రోత్సాహాన్ని అందించాలని కర్షకులు కోరుతున్నారు.




**ప్రయోజనాలు** ఆలస్యంగా జీర్ణమవటంవల్ల మధుమేహ వ్యాధిగ్రస్థులకు లాభిస్తుంది. వీటిల్లో చక్కెర పదార్థాలు తక్కువగా ఉంటాయి. టైప్-2 చక్కెరవ్యాధి నిరోధానికి సాయపడతాయి. చిరుధాన్యాల్లోని మెగ్నీషియం అధిక రక్తపోటు తగ్గించటంలో ఉపకరిస్తుంది. చిరుధాన్యాల్లో ఖనిజ లవణాలు, బి-కాంప్లెక్స్ విటమిన్లు పిల్లల్లో ఎదుగుదలకు దోహదపడతాయి. పాస్పరస్ శరీర కణాల పెరుగుదలకు, నాడీవ్యవస్థ సక్రమ పనితీరుకు, పిండి పదార్థాలు శక్తిగా మారడానికి సహకరిస్తుంది.
వీటిలోని నయాసిస్ అనే బి-విటమిన్ రక్తంలో చెడుకొలెస్ట్రాల్ స్థాయిని తగ్గిస్తుంది. మంచి కొలెస్ట్రాల్ పెరుగుతుంది.
వీటిని తరచూ తీసుకోవడం వల్ల గుండెసంబంధిత వ్యాధులు తగ్గుతాయి. మూత్రపిండాలు, కాలేయం, రోగనిరోధక వ్యవస్థ సక్రమంగా పనిచేస్తాయి. పేగుసంబంధిత అల్సర్లు, క్యాన్సర్లు ఏర్పడే అవకాశాలను తగ్గిస్తాయి. మలబద్ధకం, ఉబ్బసం, ఊబకాయం, తిమ్మిరివంటివి రాకుండా సహకరిస్తాయి. సామలలో ఎక్కువగా ఇనుము, ఖనిజ లవణం ఉండటంతో మహిళల్లో రక్తహీనతను నివారిస్తుంది.
అధిక పీచుపదార్థం పిత్తాశయంలో రాళ్లు ఏర్పడకుండా కాపాడుతుంది.

## బెంగళూరులో ఇలా.. హైదరాబాద్‌లో సాధ్యమయ్యేనా..?

చెరువుల పునరుజ్జీవంలో బెంగళూరు మహానగరం దేశానికే ఆదర్శంగా మారింది. ఈ నగరంలో దాదాపు 350 చెరువులు ఆక్రమణల చెరలో ఉండేవి. వాటన్నింటిని మంచినీటి తటాకాలుగా మార్చడంలో కర్ణాటక ప్రభుత్వం విజయం సాధించింది. అక్కడి ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చి చెరువుల చుట్టూ ఆక్రమణలను తొలగించి పర్యాటక ప్రాంతాలుగా మార్చారు. వాటిని పరిశీలించేందుకు హైదరాబాద్ నుంచి హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆధ్వర్యంలో అధికారుల బృందం బెంగళూరు నగరానికి గురువారం వెళ్లింది. అక్కడ సాధించిన ఫలితాలను నగరంలోని చెరువుల పునరుజ్జీవంలో అమలు చేయడానికి ఉన్న సాధ్యాసాధ్యాలను అంచనా వేయనున్నారు.
నాడు ఆక్రమణలు ఇలా..: బెంగళూరు మహానగరంలో 350 చెరువులంటే దాదాపు అన్నీ అయిదారేళ్ల క్రితం వరకు ఆక్రమణలోనే ఉన్నాయి. బృహత్ బెంగళూర్ మహానగర పాలిక (బీబీఎంపీ) సంస్థ ఆక్రమణల్లో కుచించికపోయిన చెరువులను పూర్వ రూపు తీసుకొచ్చే బాధ్యతను తీసుకుంది. 300 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఎలహంక చెరువు, 164 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న జక్కూర్ చెరువును మంచినీటి సరస్సుగా తీర్చిదిద్దాలని నిర్ణయించారు.
ఒక్కో చెరువుపై దాదాపు రూ.30 కోట్ల నుంచి రూ.50 కోట్ల వరకు వ్యయం చేశారు. పరిశీలన ఇలా..చెరువుల సుందరీకరణే కాకుండా అక్కడి వాతావరణ హెచ్చరిక వ్యవస్థలను కూడా తెలుసుకున్నారు.
చెరువుల చుట్టూ ఉన్న ఆక్రమణలను తొలగించిన తీరును అంచనా వేశారు.: బెంగళూర్‌లోని కర్ణాటక స్టేట్ నేచురల్ డిజాస్టర్ మానిటరింగ్ విధానాన్ని తెలుసుకున్నారు. పర్యటనలో వీరు: రీజినల్ ఫైర్ అధికారులు వి.పాపయ్య, ఏ. జయప్రకాష్, ఏఈ నాగరాజు, ఇన్‌స్పెక్టర్ విజయ్ ఆదిత్య తదితరులున్నారు.

# 'బంజారా'హిల్స్ కబ్జా

హైదరాబాద్: నగరంలో ఖరీదైన ప్రాంతం బంజారాహిల్స్‌లో ప్రభుత్వ స్థలాలను కొందరు ఆక్రమించుకుంటున్నారు. అపోలో ఆసుపత్రికి సమీపంలోని వినాయక్‌నగర్‌లో సుమారు మూడెకరాల భూమిని స్వాధీనం చేసుకునేందుకు వారు కొన్ని నెలలుగా ప్రయత్నిస్తున్నారు. 50, 60 గజాల చొప్పున ఒక్కో ప్లాటును రూ.10-15 లక్షల వరకు విక్రయిస్తున్నారు. కొన్నవారిలో కొందరు నిర్మాణాలు చేపట్టారు. స్థానికుల ఫిర్యాదుతో అధికారులు కూల్చివేసినా కొద్దిరోజులకే మళ్లీ మొదలుపెట్టారు. గదులు నిర్మిస్తే.. కిరాయి రూ. వేలల్లో :



షేక్‌పేట్ మండలం సర్వే నంబర్ 102/1, బంజారాహిల్స్ వినాయకనగర్‌లోని మూడెకరాలు ప్రైవేటు పట్టాభూముల పేరుతో విక్రయిస్తున్నారు. కొంటే ఆదాయం బాగా వస్తుందని ఆశ పెడుతున్నారు. రెండు, మూడు గదులు నిర్మిస్తే.. కిరాయి రూ.వేలల్లోనే వస్తుందని చెబుతున్నారు. ఈ స్థలం విలువ సుమారు రూ.90 కోట్లపైగా ఉంటుందని అంచనా. సీసీ కెమెరాల నిఘా: ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్న వ్యక్తులు.. అధికారులు, పోలీసులు వస్తే వెంటనే సమాచారం తెలిసేలా కబ్జాదారులు సీసీ కెమెరాలతో నిఘా ఉంచడం గమనార్హం. ఒక ఇంటిపై ఉన్న పిల్లర్లకు నాలుగువైపులా నిఘా నేత్రాలను అమర్చారు.

# జీవనశైలి వ్యాధులకు ప్రత్యేక కేంద్రాలు




హైదరాబాద్: మారిన ఆహారపు అలవాట్లు.. ఒకేచోట కూర్చొని చేసే విధులు.. శారీరక వ్యాయామం లేకపోవడంతో చాలామందిలో జీవనశైలి వ్యాధులు దాడి చేస్తున్నాయి. అధిక బరువు, ఊబకాయం, మధుమేహం, అధిక రక్తపోటు, గుండె జబ్బులు, క్యాన్సర్ ఇతర జీవనశైలి వ్యాధుల బారినపడుతున్నారు.
గతంలో జరిగిన ఒక సర్వే ప్రకారం హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో 40శాతం వరకు అధిక బాడీ మాస్ ఇండెక్స్ (బీఎంఐ) ఎదుర్కొంటున్నారు. వయసు, ఎత్తుకు సమానంగా కాకుండా ఎక్కువ బరువుతో బాధపడుతున్నారు. వీటిని దీర్ఘకాలికంగా నిర్లక్ష్యం చేయడం వల్ల గుండె జబ్బులు, కిడ్నీలు దెబ్బతినడం, కంటి చూపు మందగించడం, పక్షవాతం తదితర వ్యాధుల బారిన పడుతున్నారు.
నిమ్స్‌కు వస్తున్న కిడ్నీ వ్యాధిగ్రస్తుల్లో 30-40శాతం మంది మధుమేహం, అధిక రక్తపోటు బాధితులే. ఆఖరి దశలో వైద్యులను ఆశ్రయిస్తున్నారు. ఈ తీవ్రతను గుర్తించిన వైద్యారోగ్యశాఖ జీవనశైలి వ్యాధుల చికిత్సలపై ప్రత్యేక దృష్టి సారించింది. ప్రభుత్వ బోధనా ఆసుపత్రుల్లో ప్రత్యేకంగా ఈ క్లినిక్‌లు ప్రారంభిస్తున్నట్లు వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనరసింహ ప్రకటించారు.
ఉస్మానియా, గాంధీలో ఈ క్లినిక్‌ల ఏర్పాటుకు కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. ఈ రెండు ఆసుపత్రులకు నిత్యం 4 వేల మంది రోగులు వస్తున్నారు. సోమ, మంగళ, బుధ వారాల్లో మరింత రద్దీ ఉంటోంది. మధుమేహం, అధిక రక్తపోటు లాంటి సమస్యలుంటే.. ఈ క్లినిక్‌ల్లోనే చెక్ చేసి మందులిచ్చి పంపనున్నారు. దీంతో ప్రధాన ఓపీ వద్ద రద్దీ తగ్గనుంది.
స్క్రీనింగ్.. అవగాహన సైతంజీవనశైలి వ్యాధులు దాడి చేస్తుండటంతో ముందే అప్రమత్తం కావాలని వైద్యులు సూచిస్తున్నారు. 25 ఏళ్ల నుంచి బీపీ, మధుమేహం లాంటి వాటిపై స్క్రీనింగ్ తప్పనిసరని సూచిస్తున్నారు. యువత మూడు నెలలకోసారి బీపీ, మధుమేహం, బీఎంఐ చెక్ చేసుకోవాలని చెబుతున్నారు.
ఈ క్లినిక్‌ల్లో పరీక్షలే కాకుండా జీవనశైలి వ్యాధుల బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తారు.
వారంలో కనీసం 5 రోజులపాటు వ్యాయామం తప్పనిసరి. శరీరానికి చెమట పట్టేలా వేగవంతమైన నడక (బ్రిస్క్ వాక్), ఈత, సైక్లింగ్, యోగా లాంటివి చేయాలి. దీనివల్ల అధిక బరువు, మధుమేహం తదితరాలను నియంత్రణలో పెట్టుకోవచ్చని వైద్యులు సూచిస్తున్నారు.

# సిబ్బంది నామమాత్రం.. సేవలు తూతూమంత్రం




వికారాబాద్ : జిల్లాలో పశు వైద్య వ్యవస్థ గాడి తప్పి అన్నదాతలు మూగజీవాల రక్షణకు నానా పాట్లు పడుతున్నారు. పశువులను పరీక్షించి చికిత్సలు అందించాల్సిన వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్లు ఖాళీలు ఏళ్లుగా భర్తీ కావడంలేదు. దీంతో సేవలు అందే అవకాశం లేకుండా పోతోంది. ఈ నేపథ్యంలో పశువైద్య కేంద్రాలపై కథనం..
సుస్తీ చేస్తే అంతే సంగతి
జిల్లా రైతులు వ్యవసాయానికి అనుబంధంగా పాడిపశువులను పెంచుతున్నారు. వీటికి సుస్తీ చేస్తే సరైన చికిత్స అందటం లేదు. సాధారణంగా శీతాకాలం,వేసవి కాలాల్లో పశువులకు రకరకాల వ్యాధులు వస్తుంటాయి. ఆసుపత్రుల్లో ఎక్కడా అవసరమైన మందులు అందుబాటులో లేవు. చికిత్స కోసం వచ్చిన పశువులకు సరైన మందులు ఇవ్వకుండానే పంపిస్తున్నారు. లేదా బయట కొనుగోలు చేయాలని సూచిస్తున్నారు.
కూలుతున్న గోడలు, కురుస్తున్న భవనాలు
వికారాబాద్, పరిగి, తాండూరు నియోజక వర్గాల్లో పరిధిలో పశు వైద్య కేంద్రాలన్నీ నేటికీ ఏళ్ల నాటి శిథిలమైన పాత భవనాల్లో కొనసాగుతున్నాయి.
మర్పల్లి మండలం కల్‌కోడా పశువుల ఆసుపత్రిలో రెండు నెలల క్రితం కురిసిన వర్షాలకు ఒక వైపు గోడ పూర్తిగా కూలిపోయింది. వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ఆసుపత్రి పూర్తిగా శిథిలమై డాక్టర్లు, సిబ్బంది కూర్చోలేకపోతున్నారు.
అధికారికి (ఎ.డి.) ఇరుకు గదే ఆధారం
తాండూరుగ్రామీణ: తాండూరు పశుసంవర్ధక శాఖ కార్యాలయ భవనంలో ఎ.డి.కి ఇరుకు గది ఉండగా మరో గది సామగ్రితో నిండిపోయింది. రైతులకు అందించే దాణా, మందులు వస్తే ఆరుబయట నిల్వ చేయాల్సిన పరిస్థితి. పట్టుమని పది మంది రైతులు కార్యాలయంలోకి వెళ్లేందుకు వీల్లేనంత ఇరుకుగా ఉండటంతో సిబ్బంది, పట్టణం, గ్రామాల నుంచి వచ్చే రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పశువైద్యాన్ని సైతం గత్యంతరం లేక పరిసరాల్లోని చెట్ల కిందనే నిర్వహిస్తున్నారు.
డిప్యుటేషన్ పద్ధతిలో సర్దుబాటు చేస్తున్నాం
పశువైద్య సేవలకు ఇబ్బందులు రాకుండా ఖాళీలు ఉన్న చోట డిప్యుటేషన్ పద్ధతిలో సర్దుబాటు చేస్తున్నాం. భవనాల విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తెచ్చాం. నిధులు మంజూరు చేస్తే సంబంధిత శాఖాధికారులు పనులు ప్రారంభిస్తారు.
డాక్టర్ సదానందం, జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి.

# లెక్క తేలాకే.. సంయుక్త సర్వే



బషీరాబాద్: 'ముందుగా మన లెక్కలు తేల్చుకుందాం.. ఆ తరువాత ఎవరెవరు ఎంత భూమి కబ్జా చేశారనే వివరాలు పూర్తిగా బయటపడే అవకాశం ఉందని' బషీరాబాద్ మండల రెవెన్యూ, అటవీశాఖ అధికారులు కసరత్తు ప్రారంభించారు. అటవీశాఖ లెక్కలు, రెవెన్యూ అధికారుల లెక్కలకు పొంతన లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కర్ణాటక రాష్ట్ర అధికారులతో సంయుక్త సర్వే చేపడితే ముందుగా మన లెక్క సరిగా లేకపోతే ఇబ్బంది పాలయ్యే అవకాశం ఉందని అధికారులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈ కారణంగానే ఇటీవల జరగాల్సిన సంయుక్త సర్వే వాయిదా పడిందని సిబ్బంది పేర్కొంటున్నారు.
**పక్షం రోజులుగా ఇదే పనిలో..**
తాండూరు అటవీశాఖ అధికారులు, బషీరాబాద్ మండల అటవీ, రెవెన్యూ అధికారులు మండలంలోని అటవీ భూమి ఎంత మేరకు ఉందనే పూర్తి వివరాలను వెలికితీసే పనిలో పడ్డారు. ఇస్మాయిల్‌పూర్, నీళ్లపల్లి, మైల్వార్ తండా పరిధిలో కర్ణాటక రాష్ట్ర సరిహద్దు ఆనుకొని ఉంది. ఇందులో రెవెన్యూ భూమి కొంత, అటవీశాఖ పరిధి భూమి ఉంది. మన హద్దులు ముందుగా నిర్ణయించుకోవాలని పక్షం రోజులుగా ఇరుశాఖల అధికారులు అడవిలో తిరుగుతూ హద్దులు నిర్ధారిస్తున్నారు. మరోవైపు కర్ణాటక రాష్ట్రం కలిబురిగి నుంచి అటవీశాఖ మ్యాప్‌ను సైతం పట్టుకొని హద్దులపై ప్రాథమికంగా నిర్ధారణ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు.
**650 ఎకరాలపైగానే కబ్జా..** మండలంలో మొత్తం 650 ఎకరాలపైగానే తెలంగాణ అటవీ భూమి అన్యాక్రాంతమైనట్లు ప్రాథమికంగా అధికారులు గుర్తించారు. ఇందులో తెలంగాణ, కర్ణాటకకు చెందిన వ్యక్తులు ఉన్నారు. ఎవరెవరు ఉన్నారు.. ఎన్ని ఎకరాల్లో కబ్జా చేశారు.. ఏ పంటలు సాగు చేస్తున్నారనే విషయాలను అటవీశాఖ అధికారులు వివరాలు తీశారు. ఇటీవల డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే (డీఐ) శివకుమార్, తాండూరు ఫారెస్ట్ రేంజర్ శ్రీదేవి సరస్వతి, సెక్షన్ అధికారి స్నేహశ్రీ, బీట్ అధికారి మల్లప్ప, సర్వేయర్లు రవి, బక్కప్రభు అడవంతా తిరిగి సర్వే చేశారు.
**కలెక్టర్‌కు సమగ్ర నివేదిక**
ప్రాథమికంగా మన లెక్కలు తేల్చిన తరువాత జిల్లా కలెక్టర్‌కు నివేదిక అందించనున్నారు. నివేదిక ఆధారంగా కలెక్టర్ కర్ణాటక వారికి సమయం కేటాయిస్తారు. ఇరు రాష్ట్రాల అధికారులు కలిసి సంయుక్త సర్వే చేసి హద్దులు పాతనున్నారు. అటవీ భూముల్లో కర్ణాటక రైతుల కబ్జాల పర్వం సంయుక్త సర్వేతో సద్దుమణిగే అవకాశం ఉందని తాండూరు అటవీ రేంజ్ అధికారి శ్రీదేవి సరస్వతి, బషీరాబాద్ తహసీల్దార్ వెంకటేష్ అభిప్రాయ పడ్డారు.

# చెరువును చెరపట్టలేరిక!

హైదరాబాద్: కొన్నేళ్లుగా నత్తనడక సాగుతున్న చెరువుల ఎఫ్‌టీఎల్ తుది నోటిఫికేషన్ ప్రక్రియ శరవేగంగా సాగుతోంది. హైకోర్టు ఆదేశాలతో పాటు చెరువుల పరిరక్షణకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇవ్వడంతో వేగం పుంజుకుంది. మొత్తం హెచ్‌ఎండీఏ పరిధిలోని 3,634 చెరువులు ఉండగా, గత 1012 ఏళ్లలో కేవలం 230 చెరువులకు మాత్రమే తుది నోటిఫికేషన్ ఇచ్చారు. గడిచిన రెండు నెలల్లో ఏకంగా 234 చెరువులకు తుది నోటిఫికేషన్ జారీచేశారు. ఇప్పటివరకు మొత్తంగా 464 చెరువులకు ఎఫ్‌టీఎల్ తుది నిర్ధారణ పూర్తయ్యింది. ఈ కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తుండటంతో, హెచ్‌ఎండీఏ యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకుంటోంది. ప్రతి లేక్ ప్రొటెక్షన్ కమిటీ ఆధ్వర్యంలో జిల్లాల యంత్రాంగంతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహిస్తుండటంతో, క్షేత్రస్థాయి యంత్రాంగంలో కదలిక వచ్చింది. హెచ్‌ఎండీఏ పరిధిలో ప్రస్తుతం 2,836 చెరువులకు ప్రాథమిక నోటిఫికేషన్ చేశారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, అభ్యంతరాల అనంతరం తుది నోటిఫికేషన్ జారీ చేయనున్నారు.



మొత్తంగా ఈ ఏడాదిలోపు 6070 శాతం చెరువులకు తుది నోటిఫికేషన్ ఇచ్చేందుకు
హెచ్‌ఎండీఏ కసరత్తు చేస్తోంది.
అవుటర్ లోపల హైడ్రాదే..
ఇప్పటికే అవుటర్ లోపల చెరువులను హైడ్రా కిందకు చేర్చుతూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఎఫ్‌టీఎల్ వరకు హెచ్‌ఎండీఏ నిర్ధారించినప్పటికీ, పరిరక్షణ మొత్తం హైడ్రా చూస్తుంది. ఇక్కడ చేపట్టే నిర్మాణాలు, లేఅవుట్లకు మొదట హైడ్రా క్లియరెన్సు వచ్చాకే, హెచ్‌ఎండీఏ అనుమతులు ఇవ్వనుంది. నగరం చుట్టూ ఉన్న చెరువులు భవిష్యత్తులో ఆక్రమణలకు గురికాకుండా ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టింది. ఒకవేళ ఆక్రమణలు జరిగినా, ఇప్పటికే ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణాలు ఉన్నా.. హైడ్రా విచారించి తదుపరి చర్యలు తీసుకోనుంది.

## సమావేశాలతోనే సరి.. సమస్యల పరిష్కారమేది?

వేములవాడ : వేములవాడ మండలం ఆరెపల్లికి చెందిన ఓ నిర్వాసితుడికి చింతల్‌ఠాణా ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో పట్టా ఇచ్చారు. ఆ స్థలంలో ఇప్పటికే ఓ కట్టడం ఉండటంతో మరో చోట కేటాయించాలని కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఈయన ఒక్కడే కాదు. ఇలా చాలా మంది నిర్వాసితులు సమస్యలు పరిష్కారం కాక ఇబ్బందులు పడుతున్నారు.
బోయినపల్లి మండలం వరదవెల్లిలో పలువురు నిర్వాసితులకు కేటాయించిన ఇళ్ల స్థలాలకు సంబంధించిన భూమిపై కోర్టులో కేసు ఉంది. ఈ స్థలంలో ఇళ్లు నిర్మించుకోవడానికి సాధ్యపడటం లేదు. నిర్వాసితులు తమ పిల్లల వివాహాలు, అత్యవసర సమయంలో ఆసుపత్రి ఖర్చుల కోసం స్థలం విక్రయించుకోవడానికి కూడా వీలు లేకుండా పోయింది. 2016 నుంచి సమస్య కొలిక్కి రావడం లేదు. అధికారులు ఇదే గ్రామంలో మరో చోట స్థలం కేటాయించకుండా తాత్సారం చేస్తున్నారు. అధికారుల పరిధిలో ఉన్న చిన్న చిన్న సమస్యల పరిష్కారం కోసం కూడా నిర్వాసితులు ఏళ్లుగా ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. రాజరాజేశ్వర (మధ్యమానేరు) జలాశయంలో ముంపునకు గురైన నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోసం అధికారులు సమావేశాలు నిర్వహిస్తున్నప్పటికీ ఫలితం ఉండటం లేదు. అనేకసార్లు దరఖాస్తులు చేసుకున్నా విచారణలతోనే కాలం వెల్లదీస్తున్నారు. ఫలితంగా దశాబ్ద కాలంగా పరిహారం కోసం ఎదురుచూపులు తప్పడం లేదు. జిల్లాలోని బోయినపల్లి మండలం మాన్వాడ వద్ద నిర్మించిన మధ్యమానేరు జలాశయంలో అనుపురం, కొడుముంజ, రుద్రవరం,



సంకెపల్లి, చీర్లవంచ, శాభాష్‌పల్లి, చింతల్‌ఠాణా, గుర్రంవానిపల్లి, కొదురుపాక, నీలోజిపల్లి, వరదవెల్లి గ్రామాలు ముంపునకు గురయ్యాయి. కుటుంబ పరిహారం అందించేందుకు అధికారులు ఇంటింటి సర్వే నిర్వహించి 10,683 కుటుంబాలు నిర్వాసితులుగా మారుతున్నట్లు గెజిట్ ప్రచురించారు.
ఆర్‌అండ్‌ఆర్ కాలనీలను ఏర్పాటు చేసి అర్హులైన వారికి ఒక్కొక్కరికి 242 చదరపు గజాల ఇంటి స్థలం (ప్లాట్)ను అందించడంతోపాటు నిర్వాసితుల వృత్తి ఆధారంగా కుటుంబ పరిహారం అందించారు. అయితే గెజిట్ ప్రచురించిన సమయంలో అనేక మంది నిర్వాసితుల వృత్తి తప్పుగా నమోదైంది. గ్రామంలో నివాసం ఉన్నవారి పేర్లు తప్పిపోయాయి. అధికారుల తప్పిదాలతో పరిహారానికి దూరమయ్యారు.
**పెండింగ్‌లో 3,800 దరఖాస్తులు**
పరిహారం అందని నిర్వాసితులు ఏళ్లుగా తమకు న్యాయం చేయాలని కోరుతూ మండలంలోని తహసీల్దారు, ఆర్డీవో కార్యాలయాలతోపాటు ప్రజావాణిలో దరఖాస్తులు ఇస్తూనే ఉన్నారు. గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లోనూ అధికారుల ఎదుట గోడు వెళ్లబోసుకొని దరఖాస్తులు ఇచ్చారు. కుటుంబ పరిహారం, ఇళ్లు, ఇంటి అడుగు స్థలం, భూములకు, యువతీ, యువకుల పరిహారం, తప్పిపోయినవారి పేర్లు నమోదు ఇలా వివిధ రకాల సమస్యలతో దరఖాస్తు చేసుకున్నారు. సుమారు 3,800 దరఖాస్తులు అందాయి. ఇప్పటి వరకు వీటిపై అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ ప్రారంభించడం లేదు. ప్రజాప్రతినిధులతో కలిసి అధికారులు సమీక్షలు నిర్వహిస్తున్నప్పటికీ సమస్యలు కొలిక్కి రావడం లేదు.
**చర్యలు తీసుకుంటున్నాం- రాజేశ్వర్, ఆర్డీవో, వేములవాడ**
మధ్యమానేరు నిర్వాసితుల సమస్యలను పరిష్కరిస్తున్నాం. దరఖాస్తులపై విచారణ కొనసాగుతుంది. అర్హులైన నిర్వాసితులకు న్యాయం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. మా పరిధిలో పరిష్కారమయ్యే వాటిని జిల్లా అధికారుల అనుమతితో పరిష్కరిస్తాం.

# తరచూ తిందాం.. ఆరోగ్యంగా ఉందాం!

కరీంనగర్ : మారుతున్న జీవనశైలిలో శాకాహారం ప్రాధాన్యం పెరుగుతోంది. దరిచేరుతున్న రుగ్మతల కారణంగా కొందరు.. వైద్యులు సూచిస్తున్నారని మరికొందరు.. శాకాహార ప్రియులుగా మారిపోతుండగా.. అప్పుడప్పుడు మాత్రమే మాంసాహారం తీసుకుంటూ వారంలో వీలైనన్ని ఎక్కువ రోజులు శాకాహార రుచిని మరికొందరు ఆస్వాదిస్తున్నారు. నేడు ప్రపంచ శాకాహార దినోత్సవం సందర్భంగా కథనం.

సాగు తగ్గి.. దిగుమతి భారం

ఉమ్మడి జిల్లాలో కూరగాయల సాగు గణనీయంగా తగ్గిపోతోంది. దశాబ్దం కిందటితో పోలిస్తే జిల్లాలో ఉత్పత్తి తగ్గింది. దీంతో ఇతర



ప్రాంతాల నుంచి వీటిని దిగుమతి చేసుకుంటుండటంతో వీటి ధరలు నింగిని తాకుతున్నాయి. కూరగాయలకు ప్రోత్సాహకాలు తగ్గడం, రాయితీ విత్తనాల సరఫరా, సరైన మార్కెటింగ్ లేక రైతులు సాగుకు విముఖత చూపిస్తున్నారు. 2016లో 6300 హెక్టార్లలో సాగైన సాగు.. ఇప్పుడు 1600కుపైగా హెక్టార్లకు పడిపోయింది. అన్నిరకాల కూరగాయలు కలిపి ప్రతి వ్యక్తి రోజులో 300 గ్రాములను ఆహారంగా తీసుకోవాలి. ఇలా ఏడాదికి 109.5 కిలోలవసరం. 38 లక్షల జనాభా ఉన్న జిల్లాలో 4.14 లక్షల మెట్రిక్ టన్నుల కూరగాయలవసరం. ప్రస్తుత ఉత్పత్తి ఏడాదిలో సగం కూడా ఉండటం లేదు. ఈ లోటునంతా పూరించేందుకు ఇతర జిల్లాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. ఈ పరిస్థితిలో మార్పు వచ్చే విధంగా కూరగాయలు ప్రజలకు జిల్లాలోనే అందేవిధంగా చొరవ చూపాలి.

ఇది నిజమేనండోయ్..!

ప్రతి రోజు భోజనంలో పండ్లు, కూరగాయలు తీసుకున్న వారికంటే.. వీటిని తీసుకోని వారిలో 30 శాతం హృదయ సంబంధ జబ్బులుంటున్నాయట.!

శాకాహారం సరిగ్గా తినని 26–30 ఏళ్ల మధ్య వయసున్న యువకుల్లో కొవ్వు స్థాయికి మించి ఉంటుందని.. హృద్రోగ సమస్యలు అధికమని వైద్యులు చెబుతున్నారు.

రోజులో 8 శాతం పండ్లు, ఆకుకూరలు తీసుకోవాల్సిన చోట గరిష్ఠంగా 1.5 శాతాన్ని కూడా మించకపోవడంతో పోషకాలు సరిగ్గా అందడం లేదు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ (ఎన్ఐఎన్) సర్వే ప్రకారం ప్రతిరోజు తినే ఆహారంలో 20 శాతం పీచు పదార్థాలు తప్పకుండా ఉండాలి. యువతుల్లో ఐరన్ లోపాన్ని అధిగమించేందుకు రోజూ ఆకు కూరల్ని తీసుకోవడంతో మేలు జరుగుతుందని వైద్యులు చెబుతున్నారు. ఎరుపు, పసుపు, ఆరెంజ్ రంగుల్లో ఉండే కాయగూరలతో యాంటీఆక్సిడెంట్‌లు ఎక్కువగా అందుతాయి. దీంతో ఆరోగ్యం మెరుగవుతుంది.

ప్రయోజనాలనేకం..బీన్స్, కూరగాయలు, పప్పులు, బఠాణీలు తీసుకోవడం వల్ల శరీరానికి పొటాషియం, ఐరన్, పీచు సమృద్ధిగా అందుతుంది. మంచి బ్యాక్టీరియాపై కూరగాయలు సానుకూల ప్రభావాన్ని చూపుతాయి. చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది.

తక్కువ కొవ్వు ఉండే వాటిని తినడం వల్ల మధుమేహం తగ్గుతుంది. పీచు పదార్థాలను తీసుకుంటే ఇన్సులిన్ ఉత్పత్తి మెరుగవుతుంది.

శాకాహారంతో మానసిక ఆరోగ్యం మెరుగ్గా ఉంటుంది. మాంసం వల్ల అరాకిడోనిన్ యాసిడ్ ఉత్పత్తి అయి మానసిక ప్రవర్తనపై ప్రభావం చూపుతుంది. ఆరోగ్యంగా ఉండటానికి అవసరమైన పీచు పదార్థాలు, పోషకాలు, యాంటీ ఆక్సిడెంట్స్, విటమిన్స్, మినరల్స్ శరీరానికి చేరుతాయి.

పోషకాల లోపం ఉండదు..నేడు ఫాస్ట్ ఫుడ్, మాంసాహార వినియోగం పెరగడంతో చాలామందిలో పోషకాల లోపం కనిపిస్తోంది. ముఖ్యంగా చిన్నారుల్లో అధికంగా ఈ సమస్య ఉంది. ఆకు కూరలు, కూరగాయల ద్వారా చాలా పోషకాలు అందుతాయి. అన్ని వయసుల వారు ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలి. తాజా ఆకుకూరలు, కాయగూరలతో జీర్ణక్రియ మెరుగవుతుంది. తృణధాన్యాలు, మొలకెత్తిన విత్తనాల వల్ల కూడా పోషకాలు దండిగా అందుతాయి. డాక్టర్ ఎం.సాయిప్రియ, న్యూట్రిషియన్, కరీంనగర్

# 448 ప్రత్యేక బస్సులు

మిర్యాలగూడ : బతుకమ్మ, దసరా పండగల సందర్భంగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక బస్సులు నడిపేందుకు ఆర్టీసీ సమాయత్తమైంది. ఈ నెల 1 నుంచి 11 వరకు (3, 4, 8 తేదీలు మినహా) 448 బస్సులు, తిరుగు ప్రయాణంలో ఈ నెల 13 నుంచి 16 వరకు 191 ప్రత్యేక బస్సులు నడిపేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. ప్రత్యేక బస్సులన్నీ ఉమ్మడి జిల్లాలోని డిపో కేంద్రాల నుంచి హైదరాబాద్‌కు నడిపేందుకు సిద్ధమయ్యారు. మహాలక్ష్మి పథకంతో పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరగగా.. దసరా రద్దీని తట్టుకునేందుకు ఆర్టీసీ అన్ని రకాల చర్యలు చేపట్టింది.

11న అత్యధికంగా సర్వీసులు

ప్రత్యేక ప్రణాళికలో భాగంగా ఈ నెల 11న అత్యధికంగా 125 బస్సులు నడుపనున్నారు. ఈ బస్సులు నల్గొండ, నార్కట్‌పల్లి, మిర్యాలగూడ, కోదాడ, సూర్యాపేట డిపోల నుంచి హైదరాబాద్ వరకు, దేవరకొండ డిపో నుంచి ఐఎస్ సదన్ వరకు, యాదగిరిగుట్ట డిపో నుంచి ఉప్పల్ క్రాస్‌రోడ్డు వరకు నడవనున్నాయి. వీటితో పాటు ఆయా డిపోల నుంచి నిత్యం తిరిగే 516 సర్వీసులు యథావిధిగా నడవనున్నాయి.

రద్దీకి అనుగుణంగా..

రాజశేఖర్, ఆర్ఎం, నల్గొండ

దసరా, బతుకమ్మ పండగల సందర్భంగా మొత్తం 639 ప్రత్యేక బస్సులు నడిపేందుకు సన్నద్ధమయ్యాం. ప్రయాణికుల రద్దీని బట్టి మరిన్ని అదనపు సర్వీసులు సైతం నడిపేందుకు సన్నద్ధంగా ఉన్నాం. ప్రయాణికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఎల్బీనగర్, హయత్‌నగర్ వంటి రద్దీ ప్రదేశాల్లో ప్రత్యేక సిబ్బందిని నియమించనున్నాం.

# నిర్వహణ భారంగా రైతు వేదికలు




కోరుట్ల: వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి పథంలో నడిపించడంలో భాగంగా వ్యవసాయ అధికారులు రైతులకు అందుబాటులో ఉండి మెరుగైన సేవలందించేందుకు గత ప్రభుత్వం 'రైతు వేదిక'లను అందుబాటులోకి తీసుకురావాలని యోచించింది. వ్యవసాయ, పంచాయతీరాజ్‌శాఖ ఆధ్వర్యంలో క్లస్టర్‌కు ఒక రైతు వేదికను నిర్మించాలని నిర్ణయించింది. జిల్లాలో మొత్తం 18 మండలాల్లో 71 క్లస్టర్‌లున్నాయి. క్లస్టర్‌కు ఒక రైతు వేదిక నిర్మాణానికి రూ.22 లక్షల నిధులను కేటాయించింది. కొన్నిచోట్ల ఈ నిధులతోనే రైతు వేదికలను నిర్మించగా, మరికొన్నిచోట్ల గ్రామ పంచాయతీ, ఇతర నిధులను కలిపి నిర్మించారు. 2020 చివర్లో రైతు వేదికల నిర్మాణం పూర్తికావడంతో వాటిని ప్రారంభించి అందుబాటులోకి తెచ్చి అన్నదాతలకు సేవలను చేరువ చేశారు.

మూడేళ్లకే దెబ్బతింటున్నాయి..

రైతు వేదికలు గ్రామాలకు దూరంగా నిర్మించారు. వాటి నిర్మాణంలో పూర్తిస్థాయి నాణ్యత ప్రమాణాల పాటించకపోవడంతో కొన్నిచోట్ల నిర్మించిన మూడేళ్లకే దెబ్బతింటున్నాయి. తలుపులకు పురుగు పడుతుండగా.. గోడల రంగులు వెలిసిపోయాయి. వేదికల్లోని సౌండ్ బాక్స్‌లు, కుర్చీలు, ఇతర పరికరాలు చోరీకి గురవుతున్నాయి. పలుచోట్ల కిటికీలు, టైల్స్ ధ్వంసమయ్యాయి. రాత్రిపూట మందుబాబులకు అడ్డాగా మారుతున్నాయని అన్నదాతలు వాపోతున్నారు. సమస్యలపై జిల్లా వ్యవసాయశాఖ అధికారిణి వాణీని సంప్రదించగా రైతు వేదికల నిర్వహణ బిల్లులు చాలాకాలంగా రావడం లేదని.. వాటి నిర్వహణ ఇబ్బందిగా ఉందని పేర్కొన్నారు.

అయిదు నెలలే నిధులు..

జిల్లాలో రైతు వేదికలు రైతులకు అందుబాటులోకి వచ్చి సుమారు 3 ఏళ్లు అవుతుంది.

ప్రారంభంలో రైతు వేదికల నిర్వహణ కోసం నెలకు రూ.9 వేల చొప్పున నిధులు అందిస్తుండేవారు. ఇప్పటివరకు కేవలం 5 నెలలు మాత్రమే అందించారు.

రైతు వేదికల నిర్వహణ బిల్లులను ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో ఏఈవోలకు భారంగా మారింది.

కనీస నీటి వసతి అందుబాటులో లేకపోవడంతో రైతులు, వ్యవసాయశాఖ అధికారులు అవస్థలు పడుతున్నారు.

రైతు వేదికలను శుభ్రం చేసేందుకు, సమావేశానికి హాజరయ్యే వారికి కుర్చీలు వేసేందుకు సిబ్బంది లేరు.

ఎలక్ట్రికల్ పరికరాల మరమ్మతులు, పరిసరాల శుభ్రత, పిచ్చిమొక్కల తొలగింపు, మూత్రశాలలు మరుగుదొడ్ల శుభ్రత, ఇతర ఖర్చులను ఏఈవోలు భరిస్తున్నారు.

చాలాచోట్ల రెండున్నరేళ్లుగా బిల్లులు చెల్లించకుండా వదిలేయడంతో భారీగా విద్యుత్తు బకాయిలు పేరుకుపోయాయి.

# త్వరలో జిల్లాకు నూతన ఉపాధ్యాయులు



కరీంనగర్ : జిల్లాలోని పలు పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతతో బోధనపై తీవ్ర ప్రభావం పడుతోంది. జిల్లాలో 245 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి జులై 18 నుంచి ఆగస్టు 5వ తేదీ వరకు ప్రభుత్వం డీఎస్సీ పరీక్ష నిర్వహించింది. ఈసారి తక్కువ పోస్టులకు ఎక్కువ మంది పోటీపడ్డారు. కొన్ని నెలలుగా బోధన ఉద్యోగాలకు ఎదురుచూస్తున్న వారి కల నెరవేరనుంది. సోమవారం రాష్ట్ర ప్రభుత్వం డీఎస్సీ ఫలితాలను ప్రకటించింది.

ధ్రువపత్రాల పరిశీలనకు 1:3 పద్ధతిలో ఎంపిక..

245 ఉపాధ్యాయ పోస్టులకు 1:3 పద్ధతిలో మొత్తం 735 మందిని మెరిట్, రోస్టర్ ప్రతిపాదికన ఎంపిక చేశారు. మంగళవారం నుంచి అక్టోబరు 4వ తేదీ వరకు 1:3 పద్ధతిలో ఎంపిక చేసిన మెరిట్ అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాలను పరిశీలిస్తారు. అక్టోబరు 9న ప్రభుత్వ నియామక పత్రాలు అందిస్తుండటంతో దసరా సెలవుల అనంతరం కొత్త ఉపాధ్యాయులు బడుల్లో చేరనున్నారు. దీనికితోడు 2008 డీఎస్సీలో ఉద్యోగాలకు అర్హత సాధించి పలు కారణాలతో నష్టపోయిన బాధిత ఉపాధ్యాయులకు ప్రభుత్వం ఒప్పంద ప్రాతిపదికన ఎస్జీటీలుగా నియమించే ప్రక్రియ చేపట్టింది. వీరిని నియమిస్తే బోధకుల కొరత ఉండదు.

చరవాణులకు సమాచారం వస్తేనే..

నుంచి ధ్రువీకరణ పత్రాల పరిశీలన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డీఈవో జనార్దన్‌రావు ప్రకటనలో తెలిపారు. మంకమ్మతోటలోని దన్గర్‌వాడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. ఎంపికైన అభ్యర్థులకు చరవాణి నంబర్లకు సందేశం పంపించడంతోపాటు మెయిల్ ద్వారా సమాచారం వస్తుందని తెలిపారు. ఇలా సమాచారం అందుకున్న అభ్యర్థులు మాత్రమే హాజరుకావాలని కోరారు. ఒరిజినల్ ధ్రువపత్రాలతోపాటు మూడు సెట్ల అటెస్టెడ్ కాపీలతో అభ్యర్థులు హాజరుకావాలని సూచించారు.

స్పెషల్ ఎడ్యుకేటర్ విభాగంలో రెండో ర్యాంకు

కరీంనగర్ విద్యావిభాగం : రాష్ట్ర విద్యా శాఖ ప్రకటించిన డీఎస్సీ ఫలితాల్లో కరీంనగర్‌కు చెందిన ఐతం సుజాత స్పెషల్ ఎడ్యుకేటర్ స్కూల్ అసిస్టెంట్ విభాగంలో జిల్లా స్థాయిలో రెండో ర్యాంకు సాధించారు. ప్రస్తుతం కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్ భవిత కేంద్రంలో ఐఈఆర్పీగా పని చేస్తున్నారు. ఉద్యోగం చేస్తూనే అవసరమైన పుస్తకాలతో సన్నద్ధమై.. ఆశించిన ఫలితాన్ని సాధించినట్లు సుజాత పేర్కొన్నారు.

వ్యాయామ విద్యలో...కరీంనగర్ కొత్తపల్లి : డీఎస్సీ 2023 స్కూల్ అసిస్టెంట్ వ్యాయామ విద్య విభాగంలో కరీంనగర్ జిల్లా చింతకుంట గ్రామానికి చెందిన వి.పూర్ణ సాయి అఖిల్ రెండో ర్యాంకు సాధించారు. విడుదలైన ఫలితాల్లో 55 మార్కులు వచ్చాయి.

# ఏకేబీఆర్ ఎగువకు కృష్ణమ్మ అడుగులు

పెద్దఅడిశర్లపల్లి : జిల్లా ఆశలసౌధం ఏఎమ్మార్ ప్రాజెక్టు అక్కంపల్లి జలాశయం ఎగువ రైతుల సాగునీటి కష్టాలు త్వరలో తీరనున్నాయి. అక్కంపల్లి ప్రాజెక్టు ఎగువన దేవరకొండ నియోజకవర్గం పీఏపల్లి, నాగార్జునసాగర్ నియోజకవర్గం గుర్రంపోడు మండలాల్లో 6691 ఎకరాల ఆయకట్టుకు నీరందించేందుకు అడుగులు వేగంగా పడుతున్నాయి.

2021లో నాగార్జునసాగర్ ఉపఎన్నికల హామీల్లో భాగంగా అప్పటి ప్రభుత్వం దేవరకొండ నియోజకవర్గంలో పొగిళ్ల, కంభాలపల్లి, అంబాభవాని పెద్దమునిగల్, పెద్దగట్టు, ఏకేబీఆర్ ఎత్తిపోతల పథకాలు చేపట్టేందుకు రూ.585 కోట్లతో అనుమతులు జారీ చేసింది. వీటిలో ఒక్కటైన ఏకేబీఆర్ పనులు రూ.90.96 కోట్లతో వేగంగా సాగుతున్నాయి. 2022లో ప్రారంభమైన పనులు ఒప్పందం మేరకు 18 నెలల్లోనే పూర్తికావాల్సి ఉన్నా.. డ్రాయింగ్‌ల అనుమతులు, భూసేకరణలో జాప్యంతో ఆగుతూ సాగుతూ వచ్చాయి.

కొద్దిరోజులుగా పథకంలో ప్రధానమైన పంపుహౌస్ పైపులైన్ల ఏర్పాటు పనులు వడివడిగా సాగుతున్నాయి. నీటిపారుదల శాఖ అధికారులు ఇటీవల ఇందుకు అవసరమైన మోటార్లు, ప్రధాన పైపులను ప్రాజెక్టు వద్దకు తరలిస్తున్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి నాటికి ఆయకట్టుకు నీటిని సరఫరా చేసే లక్ష్యంతో ముందుకు సాగుతున్నారు.

ఏఎమ్మార్ ప్రాజెక్టులో భాగమైన అక్కంపల్లి జలాశయంలో 245 ఎఫ్ఆర్ఎల్ వరకు 1.5 టీఎంసీల నీరు నిల్వచేయవచ్చు. ప్రాజెక్టు ఎగువన పీఏపల్లి పాత గ్రామంలో పంపుహౌస్ నిర్మాణం చేపడుతున్నారు. ఈ పంపుహౌస్‌లో 0.35 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 16 క్యూసెక్కుల నీటిని విడుదల చేసే 5 మోటార్లను అమర్చుతున్నారు.



ఏకేబీఆర్ పనులకు భూసేకరణే ప్రధాన సమస్యగా మారింది. పైపులైన్ల ఏర్పాటుకు 6.4 ఎకరాల భూసేకరణ చేపట్టాల్సి ఉంది. ప్రాథమిక సర్వే, పేపర్ నోటిఫికేషన్ పూర్తయినా.. రైతులకు చెల్లించాల్సిన నష్టపరిహారంపై రైతులతో అంగీకారం కుదరకపోవడంతో జాప్యమవుతోంది. సంబంధిత అధికారులు గతంలో రైతులతో నిర్వహించిన సమావేశంలో వారి నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.

త్వరితగతిన పూర్తికి చర్యలుః

నాగయ్య, డీఈ నీటిపారుదలశాఖ

ఏకేబీఆర్ ఎత్తిపోతల పథకాన్ని త్వరితగతిన పూర్తికి చర్యలు చేపడుతున్నాం. పంపుహౌస్ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. మోటార్లు వచ్చాయి. పైపులైన్‌కోసం పైపులు తరలిస్తున్నాం. భూసేకరణ త్వరగా పూర్తయితే అనుకున్న సమయంలో ప్రాజెక్టు పూర్తి చేసి ఆయకట్టుకు నీరందిస్తాం.

# ఒడిసిపట్టాలంటే.. విడిచిపెట్టే..!

నల్గొండ : ఉమ్మడి నల్గొండ జిల్లాలో పట్టణాలు శరవేగంగా విస్తరిస్తున్నాయి. భవన నిర్మాణాలు జోరుగా కొనసాగుతున్నాయి. ఎక్కడ చూసినా సిమెంటు రోడ్లు దర్శనమిస్తున్నాయి. జలసంరక్షణ మాత్రం ఎండమావిగానే మారుతోంది. నీటిబొట్టును ఒడిసిపట్టి భూమిలో ఇంకిపోయేలా చేసే చర్యలు తగ్గిపోతున్నాయి. ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు అవగాహన కల్పిస్తున్నా, ప్రోత్సాహకాలు అందిస్తున్నా ప్రజల్లో మార్పు కనిపించడం లేదు. ఉమ్మడి జిల్లాల్లోని పురపాలికల్లో 2,36,550 గృహాలుండగా ఇప్పటి వరకు పది వేల ఇళ్లలోనే ఇంకుడుగుంతలు నిర్మించారు. దీంతో వాన నీరు వృథాగా పోతోంది.

తాజాగా ఆదేశాలు..పట్టణాల్లో భూగర్భజలం తక్కువగా ఉన్నట్లు కేంద్ర జలశక్తిశాఖ విడుదల చేసిన నివేదిక ద్వారా స్పష్టమవుతోంది. ఏటా కురుస్తున్న వర్షాలకు జల వనరులు నిండకపోగా. సహజసిద్ధంగా ఏర్పడిన వనరుల్లోనూ జలం పడిపోవడం ఆందోళన కలిగిస్తోంది. ఈ తరుణంలో వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలు పెంచాలని పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ శ్రీకారం చుట్టింది. పట్టణాల్లో 300 చ.గజాల పైబడి ఉన్న స్థలాల్లో, అన్ని నిర్మాణాల్లో విధిగా ఇంకుడు గుంతలు తవ్వించాలని ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. విద్యాసంస్థలు, ఆసుపత్రులు, ప్రభుత్వ విభాగాల్లో, ప్రైవేటు వాణిజ్య



భవనాల సముదాయాల్లో వీటిని ఏర్పాటు చేయాలని సూచించారు. ఇంకుడు గుంతలు తవ్వించక పోయినా, అవి పాడైపోయినా మున్సిపల్ అధికారులే బాధ్యత వహించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

నిబంధనలు ఇలా..నిబంధనల ప్రకారం ఇంకుడుగుంత నిర్మాణానికి భవన నిర్మాణదారులు రూ.2,500 నుంచి రూ.నాలుగు వేల వరకు డిపాజిట్ చెల్లిస్తేనే ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి అనుమతి ఇస్తుంది. తవ్విన ఇంకుడుగుంతను పట్టణ ప్రణాళిక అధికారులు పరిశీలించి నిర్మాణం సవ్యంగా ఉంటేనే ముందుగా చెల్లించిన డబ్బులు తిరిగి యజమానికి చెల్లించే వెసులుబాటు ఉంది.

అటకెక్కిందిలా..ఉమ్మడి నల్గొండ జిల్లాలోని 19 పురపాలికల్లో ఈ ఏడాది సుమారు 4500 భవన నిర్మాణాలు ప్రభుత్వ అనుమతితో చేపట్టారు. అందులో ఒకటి రెండు శాతం మినహా నిర్మాణదారులు గుంతలు తవ్వించలేదు. భవన నిర్మాణాల అనుమతి పొందే సమయంలో ఉన్న ధ్యాస తర్వాత ఉండటం లేదు. ఇంకుడు గుంతలు తవ్వి ఒక్కరు కూడా డిపాజిట్ వెనక్కి తీసుకున్నవారు లేరు. 2020 నుంచి ఉమ్మడి జిల్లాలో మొత్తం రూ.2.13 కోట్ల నిధులు మూలుగుతున్నాయి.

ఇంకుడు గుంతల ఏర్పాటుపై ప్రత్యేక చర్యలుముసాబ్ అహ్మద్ సయ్యద్, కమిషనర్, నల్గొండ పురపాలికపట్టణంలో నీటి వృథాను నివారించి వాటి సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పిస్తాం. కొత్తగా భవన నిర్మాణాలు చేపట్టే వారు విధిగా ఇంకుడు గుంతలు తవ్వి వాన నీటిని ఒడిసిపట్టుకునే విధంగా చర్యలు తీసుకుంటాం.

# ఇసుక తోడేస్తున్న సిండి'కేటుగాళ్లు'

అశ్వారావుపేట : మండలంలో ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతున్నా అరికట్టే వారే కరవయ్యారు. పగలు రాత్రి తేడా లేకుండా అడ్డగోలుగా ఇసుక తోడేస్తున్నా.. ఎవ్వరూ నోరుమెదపని పరిస్థితి. దీంతో ఇసుక అక్రమార్కులు సిండికేట్‌గా ఏర్పడి ప్రజలను నిలువుదోపిడీ చేస్తున్నారు. వీరికి అధికారుల అండదండలూ పుష్కలంగా ఉన్నాయనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నారు. సిండికేట్‌ను కాదని వేరెవరైనా ఇసుక తోలితే అధికారులు రెక్కలు కట్టుకుని వాలిపోయి, వారి వాహనాలు సీజ్ చేస్తున్నారు.

అధికారుల కదలికలపైనే నిఘా..!

ఇసుక సిండికేట్ రాయుళ్లు పోలీసులు, రెవెన్యూ అధికారుల రాకను పసిగట్టేందుకు పాల్వంచ, ములకలపల్లి, పాల్వంచ రూరల్ పోలీసులపై పాల్వంచ బస్‌స్టాండ్, అంబేడ్కర్ సెంటర్, దమ్మపేట అడ్డరోడ్డు, శివానగర్ ప్రాంతాల్లో, ములకలపల్లి మండలంలోని మాధారం, సీతారామ ప్రాజెక్టు, పూసుగూడెంలలో వేగులను ఏర్పాటు చేసుకుంటున్నారు. సాయంత్రం మొదలు వారు రాత్రి అధికారులు ఇళ్లకు చేరేవరకు ప్రతి కదలికను కనిపెడుతున్నారు.

ప్రభుత్వ రీచ్‌లు లేకపోవడంతో..

మండలంలో అధికారిక ఇసుక రీచ్(ర్యాంపులు) లేకపోవడంతో, ఇళ్ల నిర్మాణాలకు, ఇతర పనులకు ఇసుకను అక్రమ మార్గంలో ప్రజలు కొనుగోలు చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. దీన్ని అవకాశంగా మలచుకున్న అక్రమార్కులు కూతవేటు దూరంలో వాగులున్న గ్రామాలకు సైతం ట్రాక్టర్ ట్రక్కు ఇసుక రూ. 1500 నుండి 2000 వరకు వసూలుకు పాల్పడుతున్నారు. అక్రమార్కులు లాభాలను గడిస్తూ.. పంచాయతీలకు లక్షల్లో వచ్చే ఆదాయానికి గండి కొడుతున్నారు. అనధికారిక రీచ్‌లు ఏర్పాటు చేస్తే ప్రభుత్వానికి, ప్రజలకు లాభదాయకంగా ఉంటుంది.

సరిహద్దు మాటున.. దందా సాగుతోందిలా...

మండలంలోని ప్రతి గ్రామ పంచాయతీకి అయిదు కి.మీ. లోపులోనే వాగులున్నాయి. పట్టణ ప్రాంతాలకు సమీపంలో ఉన్న ముర్రేడు వాగు నుంచి పాల్వంచ, ములకలపల్లి మండలాల సరిహద్దులోని నిర్మాణ దశలో ఉన్న ఫామ్‌హౌస్‌లు, భవనాలు, గృహసముదాయాల వెనుక భాగంలో ఇసుక నిల్వ చేస్తారు. అనంతరం లారీలలో శ్రీనివాసకాలనీ, శివనగర్ మీదుగా పాల్వంచ పట్టణానికి తరలిస్తున్నారు. ములకలపల్లి మండలం పూసుగూడెం, సీతారామ ప్రాజెక్టు కాలువ, రామాంజనేయపురం, చాపరాళ్లపల్లి మీదుగా సత్తుపల్లి, తిరువూరు ప్రాంతాలకు గుట్టుచప్పుడు కాకుండా ప్రతిరోజు 5 నుంచి పది లారీల ఇసుక అక్రమంగా తరలుతోంది. ములకలపల్లి మండలం కొత్తూరు శివారులోని సీతారామ కాలువ సమీపంలో ఇసుకను అక్రమ నిల్వచేసిన చిన్నపాటి ఇసుక డంప్‌ను గుర్తించింది.

సమాచారమిస్తే చర్యలు తీసుకుంటాం..

మండలంలో ఇసుక రవాణా చేసేందుకు ఎవరికీ అనుమతులు లేవు. ఇసుక, మట్టి తోలకాలపై సమాచారమిస్తే దాడులు చేసి తగు చర్యలు తీసుకుంటాం.

పుల్లారావు, ములకలపల్లి తహసీల్దార్



## సోషల్ మీడియాలో పోస్టులు.. మాజీ మంత్రి కాకాణికి 54 ప్రశ్నలు

ముత్తుకూరు: మాజీ మంత్రి, వైకాపా నేత కాకాణి గోవర్ధన్‌రెడ్డిని పోలీసులు నెల్లూరు జిల్లా ముత్తుకూరు పీఎస్‌లో విచారించారు. సామాజిక మాధ్యమాల్లో తెదేపానేత సోమిరెడ్డిపై ఆరోపణలు, కార్టూన్ల ప్రచురణపై తెదేపా నేతల ఫిర్యాదుతో ముత్తుకూరు పీఎస్‌లో కాకాణిపై కేసు నమోదైంది. దీనికి సంబంధించి కృష్ణపట్నం సీఐ రవినాయక్ సమక్షంలో రెండున్నరగంటల పాటు విచారించారు. విచారణలో భాగంగా కాకాణిని పోలీసులు 54 ప్రశ్నలు అడిగారు. పోలీసులు అడిగిన ప్రశ్నల్లో చాలా వాటికి ఆయన సమాధానం ఇవ్వలేదు. అంతకు ముందు ఈ కేసు విచారణకు మందీమార్బలంతో ర్యాలీగా వచ్చిన కాకాణిని పోలీసులు అడ్డుకున్నారు.

బారికేడ్లు అడ్డుపెట్టి ర్యాలీని అడ్డుకోవడంతో స్వల్ప ఉద్రిక్తత చోటు చేసుకుంది. కాకాణి ఒక్కరినే స్టేషన్ వద్దకు అనుమతించారు.



## బొత్స, అచ్చెన్నాయుడి మధ్య స్వల్ప వాగ్వాదం

అమరావతి: విజయనగరం జిల్లా గుర్లలో డయేరియా కేసులపై శాసన మండలిలో స్వల్ప వాగ్వాదం జరిగింది. బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైందంటూ మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ చేసిన విమర్శలను మంత్రి అచ్చెన్నాయుడు తిప్పికొట్టారు. ప్రభుత్వం తరఫున ఇంకా పర్యవేక్షణ లోపం ఉందని బొత్స ఆరోపించారు. మృతుల విషయంలో స్పష్టత లేదన్నారు. అనంతరం అచ్చెన్నాయుడు స్పందిస్తూ గత ఐదేళ్లలో వాటర్ ట్యాంక్‌లలో పిడికెడు బ్లీచింగ్ కూడా వేసిన సందర్భాలు లేవన్నారు. పంచాయతీలకు పైసా నిధులు కేటాయించకపోగా.. కేంద్రం ఇచ్చిన వాటినీ దారిమళ్లించారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కూటమి ప్రభుత్వం వచ్చాక రూ.4వేలకోట్లతో పంచాయతీలను బలోపేతం చేసే చర్యలు చేపట్టిందన్నారు. గుర్ల ప్రాంతానికి ఇన్నాళ్లూ ప్రాతినిధ్యం వహిస్తున్నందున తన వల్ల కూడా ఇది జరిగిందని ఒప్పుకోవాలని బొత్సకు అచ్చెన్న హితవు పలికారు.

## వైకాపా పాలనలో ఆర్థిక వ్యవహారాలపై కాగ్ నివేదిక




అమరావతి: వైకాపా పాలనలో జరిగిన ఆర్థిక వ్యవహారాలను కాగ్ నివేదిక బయటపెట్టింది. 2023-24లో రూపాయిలో 52 పైసలు పన్ను వసూళ్ల ద్వారా వచ్చాయని పేర్కొంది. రూపాయిలో 30 పైసలు రుణాల ద్వారా తెచ్చారని కాగ్ వెల్లడించింది. స్థానిక సంస్థలకు రూపాయిలో 9 పైసలే చెల్లించారని తెలిపింది. మూలధన వ్యయంగా 9 పైసలే ఖర్చు చేశారని నివేదికలో పేర్కొంది. "చెల్లించిన అప్పు రూపాయిలో 7 పైసలే ఉంది.

2023-24లో రాష్ట్ర సొంతపన్ను ఆదాయం రూ.922 కోట్లు. శాసనసభ అనుమతి లేకుండా విద్యాశాఖ లో రూ.249 కోట్లు ఖర్చు చేశారు. 2023 ఏప్రిల్‌లో ఆర్‌బీఐ వద్ద రాష్ట్ర నిల్వ రూ.19కోట్లు లోటు ఉంది" అని కాగ్ నివేదికలో వెల్లడించింది.

## మెగా డీఎస్సీపై మంత్రి లోకేష్ క్లారిటీ



అమరావతి, నవంబర్ 13: ఏపీ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు కొనసాగుతున్నాయి. ప్రశ్నోత్తరాల్లో భాగంగా డీఎస్సీపై సభ్యులు అడిగిన పలు ప్రశ్నలకు మంత్రి నారా లోకేష్ సమాధానం ఇచ్చారు. తెలుగుదేశం ఆవిర్భావం తరువాత 11 డీఎస్సీలు వేశారని.. లక్షా 50 వేల మంది ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేశారని తెలిపారు. ఇందులో 9 డీఎస్సీలు చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు వేసినవే అని చెప్పుకొచ్చారు.

ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలి సంతకం మెగా డీఎస్సీ వేశారని.. దానిలో భాగంగా టెట్ తరువాత డీఎస్సీ వెయాలని నిర్ణయించామన్నారు. డీఎస్సీకి త్వరలోనే నోటిఫికేషన్ 16 వేల పైచిలుకు పోస్టులు భర్తీ చేస్తామని ప్రకటించారు. నిరుద్యోగ యువత పోరాటం మూలంగానే 93 శాతం విజయాన్ని అందుకున్నామన్నారు. సూపర్ సిక్స్ మ్యానిఫెస్టోలో తొలి హామీ 20 లక్షల ఉద్యోగాలు అని.. దానికి ఉన్న మంత్రి వర్గ ఉపసంఘంకు తనను ఛైర్మన్‌గా సీఎం చంద్రబాబు నాయుడు నియమించారని తెలిపారు.

**డీఎస్సీపై స్పష్టత..** డీఎస్సీ పై గతంలో ఎన్ని కేసులు పడ్డాయో వాటిని స్టడీ చేయమని అధికారులకు ఆదేశాలు ఇచ్చామన్నారు. అధికారులు తగినంత సమయం కావాలని అడిగారన్నారు. ఇప్పుడు ఇచ్చే నోటిఫికేషన్ పకడ్బందీగా వేయాలని వారికి చెప్పామని తెలిపారు. యుద్ధ ప్రాతిపదికన పెండింగ్ ఉపాధ్యాయ పోస్టులన్నింటినీ వచ్చే ఏడాది భర్తీచేస్తామని ప్రశ్నోత్తరాలు సందర్భంగా మంత్రి లోకేస్ సమాధానం ఇచ్చారు. సమాధానం ఇచ్చిన మంత్రి లోకేష్

**బడ్జెట్‌పై చర్చ..** ప్రశ్నోత్తరాల అనంతరం శాసనసభలో బడ్జెట్‌పై చర్చ ప్రారంభమైంది. ఎమ్మెల్యే కూన రవి కుమార్ చర్చను మొదలుపెట్టారు. 2014లో కేంద్రంలో ఉన్న ప్రభుత్వం అప్రజాస్వామికంగా రాష్ట్రాన్ని విభజించారన్నారు. గత ప్రభుత్వం విధ్వంసంతో పాలనను ప్రారంభించిందని తెలిపారు. రాష్ట్రాన్ని దెబ్బతీసి అన్ని వ్యవస్థలను నాశనం చేశారన్నారు. 2019-24 మధ్య కాలంలోని జగన్ ప్రభుత్వం కంటే బ్రిటిష్ ప్రభుత్వమే మేలంటూ వ్యాఖ్యలు చేశారు.

జగన్ వచ్చాక విద్యుత్ ఒప్పందాలను రద్దు చేశారని.. అలాగే నీటిపారుదల రంగాన్ని నిర్వీర్యం చేశారన్నారు. పోలవరం ప్రాజెక్టును నిలిపేశారని... అమరావతిని కూడా నిలిపేశారని మండిపడ్డారు. ఏజెన్సీలు మార్చడం వల్ల డయాఫ్రం వాల్ కొట్టుకుపోయిందనని కూన రవి కుమార్ పేర్కొన్నారు.

## రామ్‌గోపాల్ వర్మ ఇంటికి వెళ్లిన ఏపీ పోలీసులు



హైదరాబాద్: వివాదాస్పద దర్శకుడు రామ్‌గోపాల్‌వర్మ (ఆర్జీవీ)కు ఏపీ పోలీసులు నోటీసులు ఇచ్చారు. ప్రకాశం జిల్లా మద్దిపాడు పోలీసులు.. జూబ్లీహిల్స్‌లోని ఆర్జీవీ ఇంటికి వచ్చి అందజేశారు. ఎస్సై శివరామయ్య ఆధ్వర్యంలోని బృందం నోటీసులు ఇచ్చింది. ఎన్నికలకు ముందు 'వ్యూహం' సినిమా ప్రమోషన్ సమయంలో.. నాటి ప్రతిపక్ష నేత చంద్రబాబు, ఆయన కుటుంబ సభ్యులతోపాటు.. జనసేన అధినేత పవన్‌కల్యాణ్ వ్యక్తిత్వాలను కించపరిచేలా వర్మ ఎక్స్‌లో పోస్టులు పెట్టారంటూ ప్రకాశం జిల్లా మద్దిపాడు స్టేషన్‌లో కేసు నమోదైంది. మద్దిపాడు మండల తెదేపా కార్యదర్శి ఎం.రామలింగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆదివారం అర్ధరాత్రి పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ మేరకు విచారణకు హాజరు కావాలంటూ ఆయనకు నోటీసులు అందజేశారు. మరోవైపు తుళ్లూరులోనూ ఆర్జీవీపై కేసు నమోదైంది. చంద్రబాబు, పవన్‌కల్యాణ్, లోకేశ్ ఫొటోలను రామ్‌గోపాల్ వర్మ గతంలో మార్ఫింగ్ చేసి సామాజిక మాధ్యమాల్లో అసభ్యకరంగా పోస్టులు పెట్టారని రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షుడు నూతలపాటి రామారావు తుళ్లూరు పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. ఆయనపై చట్టపరంగా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.



## శరద్‌పవార్ ఫొటోలు వాడొద్దు..

### 'మీ కాళ్లపై మీరు నిల్చోవడం నేర్చుకోండి'.. అజిత్ పవార్ వర్గానికి సుప్రీం చురక

ఢిల్లీ: మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల వేళ.. ఎన్సీపీ చీఫ్ అజిత్ పవార్‌కు సుప్రీంకోర్టులో నిరాశ ఎదురైంది. ఎన్సీపీ వ్యవస్థాపకుడైన శరద్‌పవార్ ఫొటోలు, వీడియోలు ఎన్నికల ప్రచారంలో వినియోగించొద్దని ఆదేశించింది. అలాగే సొంతకాళ్లపై నిల్చోవడం నేర్చుకోవాలని చురకలు వేసింది. గతేడాది ఎన్సీపీ నుంచి చీలిపోయి మెజార్టీ ఎమ్మెల్యేలతో కలిసి భాజపా- శిందే సర్కారుకు మద్దతు పలికిన అజిత్ పవార్ డిప్యూటీ సీఎంగా ప్రమాణస్వీకారం చేసిన విషయం తెలిసిందే. ఆయన వర్గానికి చెందిన కొందరు ఎమ్మెల్యేలూ మంత్రులయ్యారు. దాంతో పార్టీ రెండుగా చీలిపోగా.. అజిత్ పవార్ వర్గాన్నే అసలైన ఎన్సీపీగా ఎన్నికల సంఘం గుర్తించిన సంగతి తెలిసిందే. అసెంబ్లీలో ఎక్కువమంది ఎమ్మెల్యేలు కలిగిన అజిత్ వర్గమే పార్టీ చిహ్నం, ఎన్నికల గుర్తును దక్కించుకుంది.

అయితే ప్రస్తుతం జరుగుతోన్న అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో సీనియర్ పవార్ దృశ్యాలను వాడుతున్నారని ఆరోపిస్తూ ఆయన మద్దతుదారులు సుప్రీంను ఆశ్రయించారు. ఈ క్రమంలో సుప్రీం ధర్మాసనం తాజా ఆదేశాలు జారీ చేసింది.



## సూచీలు ఢమాల్

### వరుసగా ఐదోరోజూ నష్టాలే.. 23,600 దిగువకు నిఫ్టీ

ముంబయి: దేశీయ ఈక్విటీ మార్కెట్ సూచీలు భారీ నష్టాల్లో ముగిశాయి. విదేశీ మదుపర్ల అమ్మకాలతో గత కొన్ని రోజులుగా పతనమవుతున్న మార్కెట్ సూచీలకు.. రిటైల్ ద్రవ్యోల్బణం ఆజ్యంపోసింది. అక్టోబర్ నెలలో 14 నెలల గరిష్ఠానికి చేరడంతో ఇప్పట్లో ఆర్‌బీఐ వడ్డీ రేట్లు తగ్గించకపోవచ్చన్న అంచనాలు మదుపర్ల సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. దీనికి తోడు అంతర్జాతీయ మార్కెట్‌ల నుంచి ప్రతికూల సంకేతాలు, రూపాయి జీవనకాల కనిష్ఠానికి చేరడంతో సూచీలు వరుసగా ఐదోరోజూ నష్టపోయాయి. ముఖ్యంగా బ్యాంకింగ్, ఆటోమొబైల్ షేర్లలో అమ్మకాల ఒత్తిడి కనిపించింది. హెచ్‌డీఎఫ్‌సీ, రిలయన్స్, ఐసీఐసీఐ బ్యాంక్ సూచీల పతనానికి కారణమయ్యాయి. సెన్సెక్స్ ఓ దశలో 1100 పాయింట్ల మేర పతనమైంది. నిఫ్టీ సైతం 23,600 దిగువకు చేరింది. మదుపర్ల సంపదగా భావించే బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ దాదాపు రూ.8 లక్షల కోట్లు క్షీణించి రూ.438 లక్షల కోట్ల నుంచి రూ.430 లక్షల కోట్లకు చేరింది. సెన్సెక్స్ ఉదయం 78,495.53 (క్రితం ముగింపు 78,675.18) పాయింట్ల నష్టాల్లో ప్రారంభమైంది. రోజంతా నష్టాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో 77,533.30 వద్ద కనిష్ఠాన్ని తాకిన సూచీ.. తర్వాత కాస్త కోలుకుని 984 పాయింట్ల నష్టంతో 77,690.95 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం 324 పాయింట్ల నష్టంతో 23,559.05 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 84.38గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఎన్టీపీసీ, టాటా మోటార్స్, ఇన్ఫోసిస్ మినహా మిగిలిన అన్ని షేర్లూ నష్టాల్లో ముగిశాయి. టాటా స్టీల్, మహీంద్రా అండ్ మహీంద్రా, అదానీ పోర్ట్స్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 72.30 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 2613 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లు అయిన సియోల్, టోక్యో, హాంకాంగ్ నష్టాల్లో ముగియగా.. షాంఘై లాభాల్లో స్థిరపడింది. యూరోపియన్ మార్కెట్లు లాభాల్లో మొదలయ్యాయి. 16 శాతం లాభపడిన స్విగ్గీ: స్విగ్గీ షేర్లు ఎన్ఎస్ఈలో రూ.420 వద్ద నేడు మార్కెట్లో లిస్ట్ అయ్యాయి. ఇష్యూ ధరతో రూ.390తో పోలిస్తే 8 శాతం ప్రీమియం వద్ద నమోదయ్యాయి. మదుపరులు ఆసక్తి చూపడంతో దలాల్ స్ట్రీట్‌లో ఎంట్రీ ఇచ్చిన కొద్ది సేపటికే షేర్లు రాణించాయి. దీంతో కంపెనీ మార్కెట్ విలువ ఓ దశలో రూ.లక్ష కోట్ల మైలురాయిని అధిగమించింది. మార్కెట్ ముగిసే సమయానికి ఎన్ఎస్ఈలో షేరు విలువ 16.92 శాతం లాభంతో రూ.456 వద్ద స్థిరపడింది.

## అసభ్యకర పోస్టులు.. వారిపై కేసులు పెడితే తప్పేంటి?: హైకోర్టు



అమరావతి: అసభ్యకర పోస్టులు పెట్టేవారిపై కేసులు పెడితే తప్పేముందని ఏపీ హైకోర్టు ప్రశ్నించింది. జడ్జిలను కూడా దూషిస్తూ పోస్టులు పెట్టారని వ్యాఖ్యానించింది. పోలీసు చర్యలను నిలువరిస్తూ ఎలాంటి ఉత్తర్వులను ఇవ్వలేమంది.

కేసులపై అభ్యంతరముంటే నేరుగా కోర్టును ఆశ్రయించాలని చెప్పింది. పిల్ వేయడానికి వీలు లేదని పేర్కొంది. సామాజిక మాధ్యమ కార్యకర్తలపై మూకుమ్మడిగా కేసులు పెడుతున్నారని విజయబాబు హైకోర్టులో పిల్ వేశారు. దీనిపై విచారణ సందర్భంగా ఉన్నత న్యాయస్థానం ఈమేరకు వ్యాఖ్యలు చేసింది.

## వైసీపీ సోషల్ మీడియా సైకోలపై వైఎస్ సునీత ఫిర్యాదు

కడప, నవంబర్13: గత ప్రభుత్వ హయాంలో తమను లక్ష్యంగా చేసుకుని సోషల్ మీడియాలో తీవ్ర అభ్యంతరకర పోస్టులు పెట్టిన వారిపై పోలీస్ కేసు నమోదు చేయాలని మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి కుమార్తె వైఎస్ సునీత నిర్ణయించుకున్నారు. ఆ క్రమంలో బుధవారం ఉమ్మడి కడప జిల్లాలోని పులివెందుల్లో పోలీస్‌స్టేషన్‌కు ఆమె చేరుకున్నారు. వైఎస్ జగన్ సతీమణి వైఎస్ భారతి పీఏ వర్రా రవీందర్ రెడ్డితోపాటు పలువురిపై ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయనున్నారు.

**వర్రా రవీందర్‌పై గతంలోనే ఫిర్యాదు..** సోషల్ మీడియాలో వర్రా రవీందర్ రెడ్డి.. తనపై పెట్టిన పోస్టులపై గతంలోనే హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులకు సునీతరెడ్డి ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. అయితే వైఎస్ సునీత చేసిన ఈ ఫిర్యాదుపై గతంలో సైబర్ క్రైమ్ పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకోలేదన్న సంగతి అందరికీ తెలిసిందే. నాటి జగన్ ప్రభుత్వం సూచనల మేరకు బీఆర్ఎస్ ప్రభుత్వం ఏ చర్యలు తీసుకోలేదనే ఓ వాదన సైతం నడిచింది.

**వై ఎస్ అవినాష్ రెడ్డి పీఏనే..** మరోవైపు వర్రా రవీందర్ రెడ్డిని ఇటీవల పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా పోలీసుల విచారణలో అతడు కీలక విషయాలను బహిర్గతం చేశాడు. వైఎస్ సునీత, వైఎస్ షర్మిల, వైఎస్ విజయలక్ష్మిలపై కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి పీఏ రాఘవరెడ్డి ద్వారా తనకు అందిన కంటెంట్‌నే తాను పోస్టు చేసినట్లు పోలీసులకు ఇచ్చిన వాంగ్మూలంలో అతడు తెలిపారు. ఈ నేపథ్యంలో పులివెందుల పోలీసులకు ఫిర్యాదు చేయాలని వైఎస్ సునీత నిర్ణయించారు.

**రిమాండ్ రిపోర్ట్‌లో సంచలన విషయాలు..** ఇంకోవైపు వర్రా రవీంద్రారెడ్డి రిమాండ్ రిపోర్టులో సంచలన విషయాలు వెల్లడయ్యాయి. వైసీపీ సోషల్ మీడియాలో సజ్జల భార్గవరెడ్డి, అర్జున్ రెడ్డి, సుమారెడ్డి కీలకమైన వ్యక్తులు అని వర్రా రవీందర్ రెడ్డి తెలిపారు. వైసీపీ సోషల్ మీడియా హెడ్‌గా సజ్జల రామకృష్ణారెడ్డి కుమారుడు సజ్జల భార్గవరెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత.. తాము మరింత విజృంభించినట్లు తెలిపారు. ఆ క్రమంలో టీవీ చానళ్లలో చర్చ కార్యక్రమాల్లో పాల్గొని.. అధికార వైసీపీకి వ్యతిరేకంగా మాట్లాడే వారిని తాము లక్ష్యంగా చేసుకున్నామన్నారు.

**టార్గెట్ వెనుక కారణమిదే..** అందులోభాగంగా ప్రతిపక్ష పార్టీల నేతలతోపాటు వారి కుటుంబ సభ్యులను టార్గెట్ చేశామని పోలీసుల ఎదుట వర్రా వివరించారు. అలాగే జనసేనా పార్టీ అధినేత పవన్ కల్యాణ్‌తోపాటు అతడి పిల్లలపై పోస్టులు చేసినట్లు అంగీకరించారు. అయితే వాటిని తొలగించాలంటూ ఓ వ్యక్తి తమను సంప్రదిస్తే.. రూ. 2 లక్షలు డిమాండ్ చేసినట్లు చెప్పారు. అలాగే జడ్జిలకు వ్యతిరేకంగా సైతం పోస్టులు పెట్టాలని సజ్జల భార్గవరెడ్డి తమపై తీవ్ర ఒత్తిడి తెచ్చాడని వర్రా ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నాడు.

**కంటెంట్ ఇచ్చేవారు..** అలాగే వైఎస్ విజయమ్మతోపాటు వైఎస్ షర్మిల, వైఎస్ సునీతపై అభ్యంతరక పోస్టులు పెట్టాలని కడప ఎంపీ అవినాశ్ రెడ్డి పీఏ రాఘవరెడ్డి తమకు సూచించాడన్నారు. అందుకు సంబంధించిన కంటెంట్ సైతం తనకు అతడే ఇచ్చేవాడని చెప్పారు. అయితే వారిపై పెట్టే ఈ పోస్టులు ఏ విధంగా ఉండాలన్నది మాత్రం అవినాశ్ రెడ్డి, రాఘవరెడ్డి చర్చించుకునేవారని వర్రా వివరించారు.

**గత ప్రభుత్వ హయాంలో..** గత ప్రభుత్వ హయాంలో వైసీపీ సోషల్ మీడియా వేదికగా సైకోలు రెచ్చిపోయారు. దీంతో వారిపై గతంలో వివిధ పోలీస్ స్టేషన్లలో కేసులు సైతం నమోదు అయ్యాయి. కానీ ఎవరిని పోలీసులు అరెస్ట్ అయితే చేయలేదు. అయితే చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం కొలువు తీరింది. అనంతరం వైసీపీ సోషల్ మీడియాలో అభ్యంతర పోస్టులు కొనసాగుతూనే ఉన్నాయి.

**లూక్ అవుట్ నోటీసులు జారీ..** ఈ నేపథ్యంలో ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులోభాగంగా వైసీపీ సోషల్ మీడియాలో కీలకంగా వ్యవహరించిన పలువురిని ఇప్పటికే అరెస్ట్ చేసింది. వారిలో వర్రా రవీందర్ రెడ్డితోపాటు ఇంటూరి రవికిరణ్ ఉన్నారు. ఇక సజ్జల భార్గవ రెడ్డితోపాటు పలువురి కోసం ఇప్పటికే ఏపీ పోలీసులు లూక్ అవుట్ పోలీసులు నోటీసులు జారీ చేసిన సంగతి తెలిసిందే.

## ఓల్డ్ వింటేజ్ బ్యూటీలా గుంటూరు ఘాటు భామ!

నవతరం భామ శ్రీలీల క్రేజ్ గురించి చెప్పాల్సిన పనిలేదు. మాస్ కి మాస్ ..క్లాస్ కి క్లాస్ అన్ని సెక్షన్లకు రీచ్ అయిన అమ్మడు శ్రీలీల. అనతి కాలంలోనే స్టార్ లీగ్ లో స్థానం సంపాదించింది. ప్రస్తుతం అమ్మడు ఎంత బిజీగా ఉందన్నది చెప్పాల్సిన పనిలేదు. తెలుగు సినిమాలతో పాటు తమిళ సినిమాల్లోనూ బిజీ అయ్యే ప్రయత్నాలు చేస్తోంది. ఫేంలో ఉన్నంత కాలమే అవకాశాలు అన్న సంగతి అమ్మడు తొందరగానే గుర్తించి ముందుకు సాగుతుంది. సెకెండ్ లీడ్..ఫస్ట్ లీడ్ అనే తారతమ్యం లేకుండా ఎలాంటి ఆఫర్లకైనా ఎస్ చెబుతుంది. అలాగే సోషల్ మీడియాలో అంతే యాక్టివ్ గా ఉంటుంది. ఎప్పటికప్పుడు కొత్త కొత్త ఫోటోలతో కుర్రాళ్లను అలరిస్తుంది. ఫోటో షూట్ అయినా..వెకేష్ నుంచి రిలీజ్ చేసే పిక్స్ అయినా సంథింగ్ స్పెషల్ గా ఉండేలా చూసు కుంటుంది. ఈ మధ్య కాలంలో శ్రీలీల



తల్లి కూడా ఎక్కువగా వెంట ఉండి హైలైట్ అవుతున్నారు. డాటర్ తో పాటు మమ్మీ కూడా ఈవెంట్లలో పాల్గొనడంతో శ్రీలీల డిమాండ్ పెరిగింది? అనడానికి ఇదొక ప్రూఫ్ అనొచ్చు. హీరోయిన్లు బిజీగా ఉంటేనే వాళ్ల అమ్మలు కూడా వెంట కనిపించడం పరిపాటే. తాజాగా శ్రీలీల కొత్త ఫోటో ఒకటి నెట్టింట వైరల్ అవుతుంది. ఇందులో అమ్మడు ఓల్డ్ వింటేజ్ భామని తలపించింది. బ్లాక్ అండ్ వైట్ లో అలరించింది. మోడ్రన్ దుస్తుల్లోనే పాత తరం హీరోయిన్ తలపించింది. పర్ఫెక్ట్ ఔట్ ఫిట్ లో తళుకులీనింది. జెబ్బల గౌను డిజైన్...మెడ చెట్టూ గులాబీ పూలతో డిజైన్ చేసి ఔట్ ఫిట్ లో శ్రీలీల ఎంతో అందంగా కనిపిస్తుంది. ఇందులో అమ్మడు ఎంతో ఆకర్షణీయంగా ముస్తాబైంది. ప్రస్తుతం ఈ ఫోటో అంతర్జాలంలో వైరల్ గా మారింది.

## శోభిత రిలేషన్ షిప్ లో కండీషన్లే లేవా?

శోభితా ధూళిపాళ త్వరలో అక్కినేని ఫ్యామిలీ ఇంట కోడలిగా అడుగు పెడుతున్న సంగతి తెలిసిందే. నాగ చైతన్యని ప్రేమ వివాహం చేసుకుంటుంది. ఇప్పటికే ఎంగేజ్ మెంట్ కూడా పూర్తయింది. పెళ్లికి మంచి ముహూర్తం తేదిని చూస్తున్నారు. ఆ గడియలు ఎప్పుడైనా వచ్చే అవకాశం ఉంది. ఇప్పటికే డిసెంబర్ లో వివాహమంటూ ప్రచారం జరుగుతోంది. మరోవైపు వచ్చే ఏడాది జరుగుతుందనే ప్రచారం ఉంది. ఈ నేపథ్యంలో తాజాగా శోభిత రిలేషన్ షిప్ గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. తన రిలేషన్ షిప్ లో ఎలాంటి షరత్తులు లేవు అంది. ఒక మనిషిని మూడు పద్దాల్లో వర్ణించలేని అభిప్రాయపడింది. షరత్తులు సైతం బ్రేక్ చేసిన వారిని ఇష్టపడతానని తెలిపింది. ఇంతవరకూ జీవితంలో ఎలాంటి డీల్ బ్రేకర్స్ లేరు అని అంది. ఈ వ్యాఖ్యలతో శోభిత ఎంతో ఓపెన్ గా ఉంటుందని నెటి జనులు అభిప్రాయపడుతున్నారు. నాగచైతన్యను బాగా అర్ధం



చేసుకున్నాకే అతడితో ప్రేమలో పడిందని గెస్ చేస్తున్నారు. చైతన్య-శోభిత కొంత కాలంగా ప్రేమించుకుంటున్నారు. తొలుత ఇద్దరి మధ్య స్నేహం మొదలైంది. అటుపై అది కాస్త ప్రేమ గా దారి తీసింది. అక్కడ నుంచి పెళ్లికి ప్రమోట్ అయింది. అలాగని వీళ్లిద్దరు దీర్ఘ కాలంగా ప్రేమించుకోవడం లేదు. చాలా తక్కువ సమయంలోనే స్నేహితులై ప్రేమికులుగా మారారు. నాగచైతన్య...సమంతతో విడాకులు తీసుకున్న తర్వాత శోభితకు దగ్గరయ్యాడు. ప్రస్తుతం శోభిత సినిమాలు చేయలేదు. మరి కొత్త ప్రాజెక్ట్ లు నచ్చక సైన్ చేయలేదా? లేక వివాహం అనే పనిలో పడి సినిమాలకు దూరంగా ఉందా? అన్నది తెలియాలి. ఇటీవలే ఆమె నటించిన ఓ మంకీ మ్యాన్, లవ్ సితార రిలీజ్ అయిన సంగతి తెలిసిందే.




## కంగువా.. రిలీజ్ లో టెన్షన్ టెన్షన్!



కోలీవుడ్ నుంచి నవంబర్ 14న రాబోతున్న మోస్ట్ అవైటెడ్ మూవీ 'కంగువా'పై దేశ వ్యాప్తంగా బజ్ ఉంది. ముఖ్యంగా తమిళం, తెలుగు భాషలలో ఈ సినిమాపైనే ఎక్కువ క్రేజ్ ఉంది. దీనికి కారణం సూర్య మాస్ ఇమేజ్ అని చెప్పొచ్చు. అలాగే పీరియాడికల్ జోనర్ లో యాక్షన్ బ్యాక్ డ్రాప్ కథతో వస్తోన్న ఈ సినిమాని విజువల్ స్పెక్టక్యులర్ గా డైరెక్టర్ శివ సిల్వర్ స్క్రీన్ పై ఆవిష్కరించారు. ఇప్పటికే ప్రేక్షకుల ముందుకొచ్చిన ట్రైలర్ కి పాజిటివ్ రెస్పాన్స్ వచ్చింది. ఈ మూవీ ప్రమోషన్స్ కూడా చాలా అగ్రెసివ్ గా చేస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని తెలంగాణాలో రిలీజ్ చేస్తోంది. భారీ ధరకి ఈ మూవీ నైజాం రైట్స్ ని మైత్రీ వారు సొంతం చేసుకున్నారు. ఇదిలా ఉంటే ఇప్పుడు ఈ సినిమాకి తెలంగాణాలో థియేటర్స్ సమస్య వచ్చినట్లు తెలుస్తోంది. రిలీజ్ కి ఇంకా ఒక్క రోజు మాత్రమే ఉంది. అయితే మైత్రీ మూవీ మేకర్స్ వారు తీసుకున్న నిర్ణయం వలన మల్టీ ప్లెక్స్ లలో సినిమా విడుదల కాకపోవచ్చని అనుకుంటున్నారు. నిజానికి థియేటర్స్ లో సినిమాలని షేరింగ్ మీద డిస్టిబ్యూటర్స్ రిలీజ్ చేస్తూ ఉంటారు. వచ్చిన కలెక్షన్స్ లో థియేటర్ ఓనర్స్ కి అలాగే డిస్టిబ్యూటర్స్ కి పర్సెంటేజ్ షేరింగ్ ఉంటుంది. అయితే 'కంగువా' చిత్రాన్ని మైత్రీ మూవీ రెంటల్ విధానంలో రిలీజ్ చేయాలని ప్లాన్ చేశారు. అంటే ఈ సినిమా ఎన్ని రోజులు థియేటర్స్ లో ప్రదర్శిస్తే అన్ని రోజులకి రెంట్ ఇస్తారు. ఏ విధానాన్ని ఏషియన్ మూవీస్ తిరస్కరించింది. రెంటల్ విధానంలో అయితే 'కంగువా' రిలీజ్ చేయమని ఏషియన్ మల్టీప్లెక్స్ ఓనర్ స్పష్టంగా చెప్పేశారంట. మిగిలిన ఎగ్జిబిటర్లు కూడా రెంటల్ విధానానికి ఒప్పుకోలేదని టాక్ వినిపిస్తోంది. దీనిపై ప్రస్తుతం చర్చలు జరుగుతున్నట్లు తెలుస్తోంది. 'పుష్ప 2' చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ రెంటల్ విధానంలో రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నారు. ఒకే సారి ఇబ్బంది పడకుండా ఉండటానికి 'కంగువా'ని కూడా అలాగే రిలీజ్ చేసి థియేటర్స్ ఓనర్స్ కి అలవాటు చేయాలని భావించారు. అయితే మైత్రీ వారు తీసుకున్న నిర్ణయాన్ని థియేటర్స్ యజమానులు వ్యతిరేకించడంతో 'కంగువా' రిలీజ్ కి ఊహించని ఆటంకాలు ఎదురవుతున్నాయి. ఒకవేళ మైత్రీ వారు వెనక్కి తగ్గకపోతే ఏషియన్ మల్టీప్లెక్స్ లలో 'కంగువా'ని ప్రదర్శించే అవకాశం ఉండదని అనుకుంటున్నారు. దీని స్థానంలో వరుణ్ తేజ్ 'మట్కా'కి ప్రాధాన్యత ఇచ్చే అవకాశం ఉందనే మాట వినిపిస్తోంది. ముఖ్యంగా తెలంగాణాలోనే ఈ సమస్య ఉంది. దీనికి పరిష్కారం దొరికితే 'కంగువా' రిలీజ్ కి ఇబ్బంది ఉండదు. లేదంటే నైజాంలో ఈ మూవీ కలెక్షన్స్ డ్రాప్ అయ్యే అవకాశం ఉంటుందని అనుకుంటున్నారు.

## రష్మికలో ఆ క్వాలిటీ 19 ఏళ్లకేనా?



నేషనల్ క్రష్ రష్మికా మందన్నా నేడు పాన్ ఇండియాలో ఓ సంచలనం. పుష్ప, యానిమల్ విజయాలు ఆమెని అగ్ర స్థానంలో కూర్చుబెట్టాయి. ప్రస్తుతం బాలీవుడ్ టాప్ స్టార్లతోనే సినిమాలు చేస్తోంది. ఇటు తెలుగు సినిమాలు చేస్తూనే బాలీవుడ్ బిగ్ స్టార్స్ తో తెలివిగా సినిమాలు చేస్తోంది. ఇదంతా పక్కన బెబితే నెట్టింట ఆమెకి ఫాలోయింగ్ పీక్స్ లో ఉంది. రష్మిక ఫోటోలు నెట్టింట ఓ రేంజ్ లో వైరల్ అవుతుంటాయి. ఇదంతా ఇప్పుడు. ఒకప్పుడు రష్మిక అంటే కేవలం కన్నడ వరకే పరిమితం. అక్కడ పెద్దగా సక్సెస్ అయింది లేదు. అమ్మడి తొలి సినిమా అంటే కిరిక్ పార్టీ గుర్తొస్తుంది. రక్షిత్ శెట్టి ఆమెని పరిచయం చేయడంతోనే పరిశ్రమకి రాగలిగింది. అయితే ఆమె తొలి సినిమా వేరే ఉందని తాజాగా వెలుగులోకి వచ్చింది. అమ్మడు మొదటి సినిమా పేరు గోపిలోల. అయితే ఈ సినిమా రిలీజ్ ఆలస్యమవ్వడంతో డెబ్యూ కిరిక్ పార్టీ అయింది. ప్రస్తుతం రష్మిక తన తొలి సినిమా ఆడిషన్ వీడియో ఒకటి నెట్టింట తెగ వైరలవుతుంది. అది చూసి నెటి జనులు ఆశ్చర్యపోతున్నారు. అందులో ఆమె యాక్టింగ్, మాటలు, అల్లరి నవ్వులు తెప్పిస్తున్నాయి. అలాగే డ్యాన్స్ కూడా బాగా చేసింది. డైలాగ్ చెప్పాలని డైరెక్టర్ కోరగా ఫన్నీగా డైలాగులు చెప్పేసింది. అప్పుడు తన వయసు 19 ఏళ్లు. కాలేజీ చదువుతుంది. హైట్ 5.5 ఉంటుందని చెప్పుకొ చ్చింది.

తన పర్సనల్ వివరాలు చెప్పి డాన్స్ కూడా అదరగొట్టేసింది. రష్మికలో అల్లరి లక్షణాలు ఇండస్ట్రీకి వచ్చాకే నేర్చుకుందనుకున్నారంతా. కానీ తనలో ఆ లక్షణం బై బర్త్ ఉందని తెలుస్తోంది. ఇక గోపిలోల సినిమా అక్టోబర్ 4న విడుదలవుతుంది. అయితే సినిమాలో ఆమె హీరోయిన్ కాదు. ఇందులో రష్మిక నటించా ల్సిన పాత్రలో మిన్ కె చంద్రను ఎంపిక చేశారు.

## 'దేవర'లో ఆ పాట... ఫ్యాన్స్ కి పండగ

యంగ్ టైగర్ ఎన్టీఆర్ సూపర్ హిట్ మూవీ దేవర ఇటీవలే ప్రేక్షకుల ముందుకు వచ్చి భారీ విజయాన్ని సొంతం చేసుకున్న విషయం తెల్సిందే. హీరోయిన్ గా జాన్వీ కపూర్ నటించిన ఈ సినిమాలో పాటలు చాలా తక్కువగా ఉన్నాయి. సినిమా విడుదలకు ముందే ఫియర్ సాంగ్ తో పాటు, ఎన్టీఆర్ – జాన్వీ కపూర్ ల కాంబోలో ఉండే చుట్టమల్లే, దావుడి సాంగ్ లను విడుదల చేయడం జరిగింది. చుట్టమల్లే సాంగ్ కి సూపర్ హిట్ టాక్ వచ్చింది. దావుడి పాటకి సైతం మంచి స్పందన వచ్చింది. సోషల్ మీడియాలో రెండు పాటలకూ వచ్చిన స్పందన తో ఫ్యాన్స్ ఫుల్ హ్యాపీ అయ్యారు. సినిమా విడుదల తర్వాత దేవర లో కేవలం చుట్టమల్లె సాంగ్ మాత్రమే ఉండటంతో ఫ్యాన్స్ తో పాటు ప్రేక్షకులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఇదేంటి ఇలా జరిగింది అని చాలా మంది అసహనం వ్యక్తం చేశారు. దావుడి పాట ఎందుకు లేదు అంటూ చాలా మంది చాలా రకాలుగా సోషల్ మీడియా ద్వారా చిత్ర యూనిట్ సభ్యులను ప్రశ్నించడం జరిగింది. వారి నుంచి ఎలాంటి స్పందన రాలేదు. కానీ తాజాగా అందుతున్న



సమాచారం ప్రకారం దసరా కానుకగా దేవర సినిమాలో దావుడి పాట ఉండబోతుందట. ఈ శుక్రవారం నుంచి ఆ పాటను థియేటర్ లో జత చేయబోతున్నట్లు సమాచారం అందుతోంది. విశ్వసనీయంగా అందుతున్న సమాచారం ప్రకారం దావుడి పాటను రెండవ వారం లేదా మూడవ వారంలో విడుదల చేయాలనే ఉద్దేశ్యంతోనే వాయిదా వేయడం జరిగిందట. సినిమాకు రెండో వారంలో రిపీట్ ఆడియన్స్ రావాలనే ఉద్దేశ్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. విశ్వసనీయంగా అందుతున్న సమాచారం ప్రకారం దేవర సినిమా కు దావుడి పాట జోడీ అయితే మరింతగా పాజిటివ్ స్పందన దక్కే అవకాశం ఉంది. ఉన్న ఒక్క రొమాంటిక్ సాంగ్ కి మంచి స్పందన వచ్చింది. అందుకే ఈ పాట కూడా జత కలిస్తే కచ్చితంగా ఫ్యాన్స్ కి కన్నుల పండుగ అన్నట్లుగా ఉంటుందని అంతా భావిస్తున్నారు. ఎన్టీఆర్ దేవర సినిమా రికార్డ్ స్థాయి ఓపెనింగ్స్ ను రాబట్టింది. మొదటి మూడు రోజుల్లోనే అత్యధిక వసూళ్లు సాధించడం ద్వారా అరుదైన రికార్డ్ లు నమోదు అయ్యాయి అనే టాక్ వినిపిస్తుంది. దేవర సినిమా తో ఎన్టీఆర్ సోలోగా కెరీర్ బెస్ట్ రికార్డ్ లను నమోదు చేయడం జరిగింది. ఓవర్సీస్ లో విడుదలకు ముందే ఏకంగా మూడు మిలియన్ ల వసూళ్లు నమోదు చేసిన దేవర సినిమా లాంగ్ రన్ లో ఎంత వసూళ్లు చేస్తుందా అంటూ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. నార్త్ ఇండియాలో ఏ స్థాయి లో సినిమా వసూళ్లు ఉంటాయి అనేది అందరిలోనూ ఆసక్తి రేకెత్తిస్తోంది.

## తనపై ఆరోపణల్ని ఖండించిన యానిమల్ బ్యూటీ

ముందస్తు ఒప్పందం ప్రకారం ఒక ఈవెంట్లో పాల్గొనేందుకు 5.5 లక్షల మొత్తాన్ని అందుకుని చివరికి ఈ వేడుకకు హాజరు కాలేదని ట్రిప్తి దిమ్రీపై మహిళా పారిశ్రామిక వేత్తలు ఆరోపించిన సంగతి తెలిసిందే. జైపూర్‌లోని ఈవెంట్ నిర్వాహకుల ఆరోపణల ప్రకారం... ట్రిప్తీ రూ. 5.5 లక్షలు వసూలు చేసినప్పటికీ ఈవెంట్‌కు గైర్హాజరు అయ్యారని ఆరోపించారు. అయితే ఈ ఆరోపణలను ఇప్పుడు ట్రిప్తి డిమ్రీ తిప్పి కొట్టారు. ట్రిప్టీ బృందం ఇవన్నీ తప్పుడు ఆరోపణలు అని అన్నారు. ఈవెంట్‌కు హాజరయ్యేందుకు ఎలాంటి ఒప్పందం చేసుకోలేదని, తమకు ఎలాంటి డబ్బు ముట్టలేదని ప్రెస్‌కి ఒక ప్రకటన జారీ చేసారు. FICCI -FLO మహిళా పారిశ్రామికవేత్తల ప్రకారం,..తమ ఈవెంట్‌కు హాజరు కావడానికి ట్రిప్టి డిమ్రీకి రూ. 5.5 లక్షలు చెల్లించారు.. కానీ ఆమె హాజరు కాలేదు అని ఆరోపించారు. అయితే ట్రిప్తీ బృందం మీడియాకు ఒక అధికారిక ప్రకటన విడుదల చేసింది. తాను నటించిన చిత్రం విక్కీ విద్యా కా వో వాలా వీడియో ప్రచారం సందర్భంగా ట్రిప్తీ డిమ్రీ తన బాధ్యతలను పూర్తిగా గౌరవించింది. సినిమాకు సంబంధించిన అన్ని షెడ్యూల్డ్ ఈవెంట్‌లు, సెషన్‌లకు హాజరయ్యింది. ముఖ్యంగా తన సినిమా ప్రచార విధులకు మించి ఎలాంటి వ్యక్తిగత ప్రదర్శనలు లేదా ఈవెంట్‌లలో పాల్గొనలేదు. ఏదైనా ఈవెంట్ కోసం ఎటువంటి రుసుములు లేదా చెల్లింపులు జరగలేదు అని వ్యాఖ్యానించారు. మహిళా పారిశ్రామికవేత్తలు చేసిన వాదనలను త్రిప్తి డిమ్రీ ప్రతినిధి



తోసిపుచ్చారు. ఇంతకుముందు ఫిక్కీ ఎఫ్ఎల్‌వో ఈవెంట్‌లోని వీడియోలలో నిర్వాహకులు త్రిప్తి డిమ్రీ హాజరుకానందుకు నిందించడం .. పోలీసులకు ఫిర్యాదు చేస్తామని ప్రకటించడం తెలిసినదే. అయితే ఈ బృందంలోని ఒక మహిళ నటి ట్రిప్తీ దిమ్రీ పోస్టర్‌ను ధ్వంసం చేయడానికి ప్రయత్నించింది. వైరల్ వీడియోలో ఒక మహిళ ఇలా చెప్పింది. తన సినిమాలు ఎవరూ చూడరు. వీళ్లు ప్రామిస్ చేస్తారు కానీ కనిపించరు. వారు సమయ నిర్వహణ నేర్చుకోవాలి. ఆమె అంత పెద్ద సెలబ్రిటీనా? ఆమె పేరు కూడా ఎవరికీ తెలియదు.

ఆమె ఎవరికీ తెలియదు. సెలబ్రిటీ అని పిలిపించుకునేందుకు అర్హూరాలు కాదు అని రాసారు. అదే వీడియోలో మరో మహిళ ట్రిప్తీ డిమ్రీని బహిష్కరించాలని డిమాండ్ చేసింది. కెరీర్ మ్యాటర్ కి వస్తే.. ట్రిప్తీ ఇటీవలే విక్కీ కౌశల్ , అమీ విర్క్‌లతో బాడ్ న్యూజ్‌లో కనిపించింది. అలాగే రాజ్‌కు మార్ రావు సరసన విక్కీ విద్యా కా వో వాలా వీడియోలో నటిస్తుంది. భూల్ భూలయ్యా 3, ఆషికి 3 వంటి చిత్రాల్లోను నటించనుంది.



# లగచర్ల ఘటన నిందితులు ఎంత పెద్దవారైనా వదిలిపెట్టం

వికారాబాద్ జిల్లా లగచర్ల ఘటనలో నిందితులు ఎంత పెద్దవారైనా అరెస్టు చేయక తప్పదని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పష్టం చేశారు. "లగచర్ల ఘటనలో ప్రణాళిక ప్రకారమే కలెక్టర్‌పై దాడి చేశారు. కేటీఆర్‌తో స్థానిక మాజీ ఎమ్మెల్యే ఫోన్‌లో మాట్లాడినట్టు రికార్డులు ఉన్నాయి. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరుగుతోంది. నిందితులను వదిలిపెట్టం. కేసులు చుట్టుముడుతున్న వేళ.. ప్రజల దృష్టి మరల్చేందుకే భారాస నాయకులు ఈ ఉదంతానికి ఒడిగట్టారు. ఫార్ములా–ఈ కారు రేస్ వ్యవహారంలో మనీలాండరింగ్‌పై గవర్నర్ అనుమతి ఇస్తే నిందితులు అరెస్టు కావాల్సిందే.
అరెస్టయితే యోగా చేస్తా.. బయటికొచ్చాక పాదయాత్ర చేస్తానని కేటీఆర్ చెప్పారు. ఈ విషయమై కేంద్రమంత్రితో మాట్లాడేందుకే కేటీఆర్ దిల్లీ వెళ్లారు" అని మంత్రి కోమటి రెడ్డి ఆరోపించారు.

## కలెక్టర్‌పై దాడి చేయిస్తే వెనక్కి తగ్గుతాం అనుకుంటున్నారా?: డిప్యూటీ సీఎం భట్టి



హైదరాబాద్: వెనుకబడిన కొడంగల్‌ను అభివృద్ధి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క (%దీప్తుఫ్ అ ఎఅఎనెతీఖఎఖతీఎఖ%) అన్నారు. బుధవారం సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పారిశ్రామిక అభివృద్ధి సాధిస్తే తప్ప ప్రపంచంతో పోటీ పడలేమన్నారు. పరిశ్రమలు రావాలంటే భూ సేకరణ జరగాల్సిందేనని స్పష్టం చేశారు. పరిశ్రమలు పెద్ద ఎత్తున తీసుకొచ్చి యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. "భూమి కోల్పోతున్న రైతుల బాధ మాకు తెలుసు. రైతుల బాధను ఇందిరమ్మ ప్రభుత్వం అర్థం చేసుకుంది. భూమి కోల్పోతున్న వారికి మెరుగైన ప్యాకేజీతో పాటు పరిశ్రమలో ఉద్యోగాలు కల్పిస్తాం. ఇళ్లు కోల్పోతున్న వారికి మంచి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇస్తున్నాం. కావాలనే కుట్రపూరితంగా కలెక్టర్‌పై భారాస శ్రేణులు దాడి చేశాయి. అమాయక గిరిజనులను రెచ్చగొట్టి దాడికి ఉసిగొల్పారు. కలెక్టర్, అధికారులపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాం. దాడి సమస్యకు పరిష్కారం కాదు.. కలెక్టర్‌తో చర్చించి పరిష్కరించుకోవాలి. ఇందిరమ్మ రాజ్యంలో భావవ్యక్తీకరణ స్వేచ్ఛ ఉంది. రాష్ట్రంలో పరిశ్రమలు రావడం భారాసకు ఇష్టం లేదా? ఇది బాధ్యత కలిగిన ప్రతిపక్షం చేయాల్సిన పని కాదు. ప్రాజెక్టుల కోసం మీరు చాలా భూసేకరణ చేశారు.. ఏనాడూ మేం కాదనలేదు. కలెక్టర్‌పై దాడి చేయిస్తే వెనక్కి తగ్గుతాం అనుకుంటున్నారా? అభివృద్ధే మా లక్ష్యం. అధికారులపై దాడి చేస్తే చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయి. మీ కోసం అమాయక ప్రజలు నష్టపోవాలా? ఉద్యమ సమయంలో కూడా ప్రజలను రెచ్చగొట్టి ప్రాణాలు కోల్పోయేలా చేశారు" అని భట్టి విక్రమార్క విమర్శించారు.



# మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అరెస్టు

## భారాస నేత పట్నం నరేందర్‌రెడ్డికి 14 రోజుల రిమాండ్

కొడంగల్: భారాస నేత, కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డికి న్యాయస్థానం 14 రోజుల రిమాండ్ విధించింది. వికారాబాద్ జిల్లా లగచర్లలో అధికారులపై దాడి ఘటనలో నరేందర్‌రెడ్డి ప్రమేయం ఉందనే ఆరోపణల నేపథ్యంలో పోలీసులు అరెస్ట్ చేశారు. వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం కొడంగల్ కోర్టులో హాజరుపరిచారు. అనంతరం న్యాయస్థానం అతనికి ఈనెల 27 వరకు రిమాండ్ విధించింది. దీంతో నరేందర్‌రెడ్డిని చర్లపల్లి జైలుకు తరలించనున్నారు. లగచర్ల ఘటనలో మంగళవారం 16 మందిని రిమాండ్‌కు తరలించిన పోలీసుల.. బుధవారం మరో నలుగురిని అరెస్ట్ చేశారు. వీరిలో ప్రధాన నిందితుడు సురేశ్ సోదరుడితో పాటు మరో ముగ్గురు ఉన్నారు.

## వికారాబాద్ ఘటన.. నిందితులను మీడియా ముందు ప్రవేశ పెడతాం: పొంగులేటి



హైదరాబాద్: వికారాబాద్ ఘటన వెనుక ఉన్నవారిని గుర్తించి.. ఆ నిందితులను మీడియా ముందు ప్రవేశ పెడతామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. రైతుల పేరుతో కొందరు పింక్ కలర్ ముసుగు వేసుకుని దౌర్జన్యానికి పాల్పడ్డారని మంత్రి ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకువచ్చేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. ఈ ఘటన వెనక ఎవరున్నారో బయటపెడతామని చెప్పారు. బుధవారం గాంధీభవన్‌లో నిర్వహించిన 'మంత్రులతో ముఖాముఖి' కార్యక్రమానికి హాజరైన మంత్రి.. భూములు, ఇళ్ల సమస్యలు, హౌసింగ్ బోర్డు ఇందిరమ్మ ఇళ్ల గురించి అధికంగా దరఖాస్తులు, ఫిర్యాదులు వచ్చినట్లు మీడియాకు తెలిపారు.

## లగచర్ల పర్యటనకు ఎంపీ డీకే అరుణ.. అడ్డగించిన పోలీసులు



పూడూరు: భాజపా ఎంపీ డీకే అరుణ లగచర్ల పర్యటనలో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. లగచర్ల వెళ్తుండగా పూడూరు మండలం మన్నెగూడ వద్ద పోలీసులు డీకే అరుణను అడ్డుకున్నారు. ఆమె కాన్వాయ్ ముందుకు వెళ్లకుండా పోలీసులు అడ్డుకోవడంతో తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. జిల్లా కలెక్టర్‌ను కలిసేందుకు వెళుంటే అడ్డుకోవడమేంటని పోలీసులపై మండిపడ్డారు. దీంతో అక్కడి నుంచే వికారాబాద్ కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. కలెక్టర్ ఆదేశాలతో డీకే అరుణ ముందుకు వెళ్లేందుకు అనుమతించారు. అనంతరం కలెక్టరేట్‌కు చేరుకొని లగచర్లలో అధికారులపై దాడి ఘటన గురించి కలెక్టర్‌తో మాట్లాడారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

## 'మహా' సీఎం శిందే బ్యాగు తనిఖీ

ముంబయి: మహారాష్ట్రలో ఎన్నికల తేదీ సమీపిస్తున్న తరుణంలో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య మాటల యుద్ధం చెలరేగుతుండడంతో రాజకీయాలు వేడెక్కాయి. శివసేన (యూబీటీ) చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే బ్యాగును ఎన్నికల అధికారులు తనిఖీ చేసిన విషయంలో అధికార, ప్రతిపక్షాలు విమర్శనాస్త్రాలు సంధించుకుంటున్నాయి. ఈ క్రమంలోనే అధికార పార్టీ నేతలకు సంబంధించిన బ్యాగులను తనిఖీ చేస్తున్న వీడియోలను ఆ పార్టీ నాయకులు సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నారు. తాజాగా పాల్ఘర్‌లో మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందే, డిప్యూటీ సీఎం అజిత్ పవార్, కేంద్ర మంత్రి రామ్‌దాస్ అథవాలే బ్యాగును ఎన్నికల సిబ్బంది తనిఖీ చేస్తున్న వీడియోలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. ఎన్నికల వేళ ప్రతిపక్ష నేతలకు సంబంధించిన బ్యాగులు, ఇళ్లనే భద్రతా సిబ్బంది తనిఖీ చేస్తారని మాజీ సీఎం, శివసేన (యూబీటీ) అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే, ఎంపీ సంజయ్ రౌత్ పలుమార్లు ఆరోపించిన విషయం తెలిసిందే. ఈ ఆరోపణలను భాజపా ఖండించింది. ఈ విషయంపై కేంద్ర ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ స్పందిస్తూ ఎన్నికల సమయంలో ఎటువంటి పక్షపాతం లేకుండా అందరు రాజకీయ నాయకుల హెలికాప్టర్‌లను తనిఖీ చేయాలని ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీలకు ఆదేశాలు ఇచ్చామన్నారు. అగ్రనేత బ్యాగులను కూడా సిబ్బంది తనిఖీ చేస్తారని పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల ప్రచారం కోసం యవత్మాల్‌కు వచ్చినప్పుడు ఎన్నికల అధికారులు తన బ్యాగ్‌ని తనిఖీ చేశారని శివసేన (యూబీటీ) చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే సోమవారం పేర్కొన్నారు. అధికార కూటమికి చెందిన ప్రముఖ నాయకుల విషయంలో ఈ నిబంధనలు పాటించట్లేదని ఆరోపించారు. ప్రధాని మోదీ, కేంద్రమంత్రి అమిత్ షా తదితర నేతల హెలికాప్టర్లు ఎప్పుడైనా తనిఖీ చేశారా? అని ఎన్నికల కమిషన్‌ను ప్రశ్నించారు.



# అధికారుల జీతం నుంచి చెల్లించాల్సిందే..

## జడ్జిలా వ్యవహరించి స్థిరాస్తుల కూల్చివేత తగదు: బుల్డోజర్ న్యాయంపై సుప్రీం తీర్పు

దిల్లీ: వివిధ కేసుల్లో ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తుల ఆస్తులను బుల్డోజర్లతో కూల్చివేయడాన్ని వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్లపై బుధవారం సుప్రీంకోర్టు తీర్పు వెలువరించింది. అధికారులు ఒక వ్యక్తి దోషి అని తేల్చి చెప్పలేరని, జడ్జిలా వ్యవహరించి నిందితుల స్థిరాస్తులను కూల్చివేయడం తగదని స్పష్టం చేసింది. రాష్ట్రాలు, ఆయా ప్రభుత్వాల అధికారులు మితిమీరి చర్యలు తీసుకోవద్దని ఆదేశించింది. కోర్టు ఆదేశాలను ఉల్లంఘిస్తే ధిక్కార చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ధర్మాసనం హెచ్చరించింది. కూల్చివేత ప్రక్రియలో నిబంధనలను ఉల్లంఘించినట్లు తేలితే, ఆ ఆస్తి పునరుద్ధరణకు సంబంధించిన పరిహారాన్ని అధికారుల జీతం నుంచి వసూలు చేయాలని కోర్టు స్పష్టం చేసింది. "కార్యనిర్వాహక అధికారి ఒక వ్యక్తిని దోషిగా ప్రకటించలేరు. ఆ అధికారి న్యాయమూర్తిగా మారి, నిందితుల ఆస్తులను కూల్చివేయాలని నిర్ణయం తీసుకోలేరు. రాష్ట్రాల ఏకపక్ష చర్యల నుంచి పౌర హక్కులకు రాజ్యాంగం రక్షణ కల్పిస్తుంది. ఒక సామాన్య పౌరుడి ఇంటి నిర్మాణంలో అతడి ఎన్నో ఏళ్ల శ్రమ, కలలు కలగలిసి ఉంటాయి. దానిలో వారి భవిష్యత్తు, భద్రత ఇమిడి ఉంటుంది. ఆ ఇంట్లో ఒక్కరే నిందితుడు అయినప్పుడు.. అందులో నివసించే మిగతా వ్యక్తులకు ఆశ్రయం లేకుండా ఎలా చేస్తారు..? అలాగే అక్రమకట్టడాల తొలగింపు కోసం ఇంటి యజమానికి 15 రోజుల గడువు ఇవ్వాలి. అంతేగాకుండా మూడు నెలల్లో మున్సిపల్ అధికారులు ఒక డిజిటల్ పోర్టల్‌ను సిద్ధం చేయాలి. ఇప్పటివరకు ఇచ్చిన షోకాజ్ నోటీసులు, అక్రమ నిర్మాణాలపై తుది ఉత్తర్వులకు సంబంధించిన వివరాలు అందులో పొందుపరచాలి" అని జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం ఈ తీర్పు వెలువరించింది. దేశవ్యాప్తంగా కొద్దికాలంగా 'బుల్డోజర్' చర్యలు హాట్ టాపిక్‌గా మారిన విషయం తెలిసిందే. ఇది రాజకీయాల్లో కీలక అంశమైంది. బుల్డోజర్ న్యాయం (%దీబశ్రీశ్రీఒశీఓవతీ యబర్‌ఱఎవ%) పేరుతో పలు రాష్ట్రాలు ఈ అస్త్రాన్ని ప్రయోగిస్తున్నాయి. యూపీలో తొలుత మొదలైన ఈ ధోరణి.. ఆ తర్వాత ఇతర రాష్ట్రాలకూ పాకింది. దేశవ్యాప్తంగా ఇటీవల కాలంలో వివిధ రాష్ట్రాలు నిందితుల ఇళ్లు, ప్రైవేటు ఆస్తులపైకి బుల్డోజర్లను పంపించడాన్ని ఇప్పటికే పలు మార్లు సుప్రీం కోర్టు తప్పుబట్టింది. నిందితుల ఆస్తులపైకి బుల్డోజర్లను పంపించడం సరికాదని స్పష్టం చేస్తూ, అక్రమంగా ఒక్క కట్టడాన్ని ధ్వంసం చేసినా రాజ్యాంగ ఉల్లంఘనకు పాల్పడినట్లేనని హెచ్చరించింది. అయితే, రహదారులు, ఫుట్‌పాత్‌ల మీద, రైలు మార్గాలు, జలాశయాలు, ప్రభుత్వ స్థలాల పరిధిలో నిర్మించిన అక్రమ కట్టడాలకు తమ ఆదేశాలు వర్తించవంటూ మినహాయింపునిచ్చింది. కాగా ఈ విషయంపై సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ గతంలో కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ చర్యల ద్వారా పౌరుల గొంతు నొక్కడం సరైనది కాదని.. చట్టబద్ధమైన పాలన జరుగుతున్న సమాజంలో బుల్డోజర్ న్యాయం ఆమోదయోగ్యం కాదని పేర్కొన్నారు. ప్రజల నివాసాల రక్షణ, భద్రత వారి ప్రాథమిక హక్కుల కిందకు వస్తాయని.. వాటిని కూల్చివేసే అధికారం ప్రభుత్వాలకు ఉండదని ఆయన పేర్కొన్నారు. దీనికి అనుమతిచ్చిన అధికారులపైనా చర్యలు తీసుకోవాలన్నారు.



# పట్టాలు తప్పిన గూడ్సు.. 39 రైళ్లు రద్దు

పెద్దపల్లి: జిల్లాలో గూడ్సు రైలు పట్టాలు తప్పడంతో పలు రైళ్లు రద్దయ్యాయి. దక్షిణ మధ్య రైల్వే 39 రైళ్లు రద్దు చేయడంతో పాటు 7 రైళ్లను పాక్షికంగా రద్దు చేసింది. 53 రైళ్లను దారి మళ్లించారు. 7 రైళ్లను రీ షెడ్యూల్ చేశారు. నర్సాపూర్–సికింద్రాబాద్, సికింద్రాబాద్–నాగ్‌పూర్, హైదరాబాద్–సిర్పూర్ కాగజ్‌నగర్, సికింద్రాబాద్–కాగజ్‌నగర్, కాజీపేట–సిర్పూర్ టౌన్, సిర్పూర్ టౌన్–కరీంనగర్, కరీంనగర్–బోధన్, సిర్పూర్ టౌన్–భద్రాచలం రోడ్, భద్రాచలం రోడ్–బల్లార్షా, బల్లార్షా–కాజీపేట, యశ్వంత్‌పూర్–ముజఫర్‌పూర్, కాచిగూడ–నాగర్‌సోల్, కాచిగూడ–కరీంనగర్, సికింద్రాబాద్–రామేశ్వరం, సికింద్రాబాద్–తిరుపతి, ఆదిలాబాద్–పర్లి, అకోలా–పూర్ణ, ఆదిలాబాద్–నాందేడ్, నిజామాబాద్–కాచిగూడ, గుంతకల్లు–బోధన్ రైళ్లను రద్దు చేశారు. పెద్దపల్లి–రామగుండం మధ్య రాఘవాపూర్ వద్ద మంగళవారం రాత్రి గూడ్సు రైలు బోల్తాపడింది. ఐరన్ కాయిల్స్‌తో వెళ్తున్న రైలు ఓవర్‌లోడ్‌లో 11 వ్యాగన్లు బోల్తా పడ్డాయి. వేగంగా వెళ్తున్న రైలు బోగీల మధ్య ఉన్న లింక్‌లు తెగిపోవడంతోపాటు ఒకదానిపై మరో బోగి పడి మూడు ట్రాక్‌లు దెబ్బతిన్నాయి. రాత్రి నుంచి ఘటనాస్థలిలో పునరుద్ధరణ చర్యలు కొనసాగుతున్నాయి. ఈ ఘటన కారణంగా దిల్లీ, చెన్నై మార్గంలో రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది.

రాఘవపూర్ సమీపంలో యుద్ధ ప్రాతిపదికన రైల్వే ట్రాక్ పునరుద్ధరణ పనులు కొనసాగుతున్నాయి. ట్రాక్‌పై బోల్తాపడిన గూడ్స్ డబ్బాలను సిబ్బంది తొలగిస్తున్నారు. తెగిపడ్డ విద్యుత్తు తీగలను పునరుద్ధరిస్తున్నారు. కొత్త పట్టాలను ఘటనా స్థలికి తెప్పించి శరవేగంగా పట్టాలను అమర్చుతున్నారు. దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్ దగ్గరుండి పనులను పర్యవేక్షిస్తున్నారు.

## ప్రియురాలిని హతమార్చి.. పత్తి చేలో పాతిపెట్టి



వీరభద్రం, స్వాతి (ఫైల్ ఫోటో)

జూలూరుపాడు: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలం మాచినేనిపేట తండాలో దారుణం జరిగింది. స్వాతి అనే యువతి దారుణ హత్యకు గురైంది. ఆమె ప్రియుడు వీరభద్రం.. యువతిని అతి కిరాతకంగా చంపి గ్రామ సమీపంలోని పత్తి పొలంలో పాతిపెట్టాడు. మూడు రోజుల తర్వాత హత్య ఘటన వెలుగులోకి రావడంతో పోలీసులు రంగంలోకి దిగి విచారణ చేపట్టారు. మణుగూరు మండలం తోగ్గుడేనికి చెందిన స్వాతి(32) ఆరేళ్లుగా వీరభద్రంతో సహజీవనం చేస్తూ మాచినేనిపేట తండాలోనే ఉంటోంది. భద్రం భార్యతో పాటు స్వాతి కూడా ఒకే ఇంట్లో ఉంటున్నారు.

కుటుంబ తగాదాలు, ఆర్థిక లావాదేవీలతోపాటు పలు కేసుల్లో భద్రం నిందితుడిగా ఉన్నాడు. కొంకాలంగా భద్రం, స్వాతిల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ప్రియురాలి అడ్డు తొలగించుకోవాలని నిర్ణయించుకున్న భద్రం.. ఈనెల 9న తన ఇంట్లోనే స్వాతిని దారుణంగా హత్య చేశాడు. అనంతరం మృతదేహాన్ని సమీపంలోని తన పత్తి పొలంలో పాతిపెట్టాడు. కొత్తగూడెం డీఎస్పీ, జూలూరుపాడు సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్సై రాణా ప్రతాప్ ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. రెవెన్యూ, పోలీస్ అధికారులు.. మృతదేహాన్ని వెలికి తీసే చర్యలు చేపట్టారు.

## కిడ్నాపర్లలా వచ్చి తీసుకెళ్తే దాన్ని అరెస్టు అంటారా?: కేటీఆర్



హైదరాబాద్: వికారాబాద్ దాడి ఘటనలో కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిని పోలీసులు మఫ్టీలో వచ్చి తీసుకెళ్లారని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ మండిపడ్డారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. కిడ్నాపర్లలా వచ్చి తీసుకెళ్తే దాన్ని అరెస్టు అంటారా..? అని ప్రశ్నించారు. నోటీసులు, కుటుంబానికి సమాచారం ఇవ్వకుండా తీసుకెళ్లారని విమర్శించారు. "నరేందర్‌రెడ్డికి ప్రైవేటు సిబ్బందితో వైద్య పరీక్షలు చేయించాలి.

ప్రభుత్వ వైద్యులు, ప్రభుత్వ వ్యవస్థపై మాకు నమ్మకం లేదు. అరెస్టు చేసిన వారిని చిత్రహింసలు పెట్టారని సమాచారం. కలెక్టర్ దాడి జరగలేదన్నారు.. దాడి జరిగిందని ఐజీ చెబుతున్నారు. వికారాబాద్ లగచర్ల ఘటన నిఘా వ్యవస్థ వైఫల్యమే. ఉద్దేశపూర్వకంగా అశాంతి రగిల్చి భూములు లాక్కునే యత్నమిది" అని కేటీఆర్ ఆరోపించారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com